


రంజాన్ వేళలు: ఇఫ్తార్ (బుధ) సా.6.23 | సహరి (గురు) ఉ.4.46

కాకినాడ సాగరతీరంలో డాల్ఫిన్స్ సందడి

వైసీపీకి 'వలంటీర్'గా..



- ఎన్నికలు సమీపించడంతో అడ్డంగా బరితెగించేస్తున్న వలంటీర్లు
- వైసీపీ నేతల ఆదేశాలతో కోడ్ ఉల్లంఘించి ఇంటింటికీ వెళ్లి పార్టీ ప్రచారం
- పార్టీ నేతల ప్రచార కార్యక్రమాల్లోనూ నేరుగా పాలుపంచుకుంటున్న వైనం
- అటు ఎన్నికల కోడ్ ఉన్నా వైసీపీ అభ్యర్థుల రహస్య సమావేశాలకు హాజరు
- అధికార పార్టీ నేతల నుంచి గిఫ్ట్‌లు, ఫోన్‌లు, నగదు, వెండి గిన్నెలు స్వీకరణ
- తమను గెలిపిస్తే ఒక్కొక్కరికి రూ.లక్ష ఇస్తామంటూ పలువురు అభ్యర్థుల ఆఫర్లు
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వలంటీర్లపై భారీగా వెల్లువెత్తుతున్న ఫిర్యాదులు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అనేకమంది వలంటీర్లు ఇంకా వైసీపీ సేవలోనే తరిస్తున్నారు. అధికారపార్టీ నేతల ప్రలోభాలకు తలొగ్గి వారి కోసం యథేచ్ఛగా పనిచేస్తున్నారు. నేరుగా వారి ప్రచార కార్యక్రమాలకు హాజరవడం దగ్గర నుంచి తమ పరిధిలో ఇంటింటికీ వెళ్లి వైసీపీకి ఓటేయాలంటూ యథేచ్ఛగా అడిగేస్తున్నారు. అదే సమయంలో ఎన్నికల కోడ్ రావడంతో విధులకు దూరంగా ఉండాల్సి ఉన్నా అదేం ఖాతరు చేయడం లేదు. నియోజకవర్గ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థులకు అన్ని విధాలా అండాదండా అందిస్తున్నారు. ఇదే అదనుగా ఎమ్మెల్యే అభ్యర్థులు సైతం పార్టీ కార్యకర్తలకు బదులు వీరిపైనే ఆధారపడి వారిని ఆర్థికంగా బాగా సంతృప్తిపరుస్తున్నారు. కాకినాడ జిల్లాలో అయితే పార్టీని గెలిపించుకుంటే ఎన్నికలయ్యాక ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున నగదు ఇస్తామంటూ నేరుగా ఆఫర్లు కూడా ఇస్తున్నారు. దీంతో ఇప్పుడు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల్లో ఎక్కడచూసినా వేలాదిమంది వలంటీర్లు అధికార వైసీపీ కోసం నేరుగా రంగంలోకి దిగి పనిచేస్తున్నారు. యథేచ్ఛగా కోడ్‌ను ధిక్కరిస్తున్నారు. ఈనేపథ్యంలో వీరిపై ఉమ్మడి జిల్లా నుంచి భారీగా ఈసీకి ఫిర్యాదులు కూడా వెళ్లాయి. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్తగా వలంటీర్ల వ్యవస్థను ప్రారంభించింది. ఒక్కో వలంటీర్‌కు గౌరవం వేతనం ఇస్తూ ప్రతి యాభై కుటుంబాలకు సంబంధించి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, పర్యవేక్షణ, పింఛన్ చెల్లింపులకు వీరిని వినియోగిస్తోంది. అయితే వీరు ప్రభుత్వ ఉద్యోగులు కానందున ఇప్పుడు ఎన్నికల కోడ్ రావడంతో పక్కకు తప్పుకోవాల్సి ఉంది. ఎలాంటి ప్రభుత్వ విధులు, ఎన్నికల విధులు, అధికార పార్టీ అభ్యర్థుల కోసం ప్రచారాలు చేపట్టకూడదు. కానీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న వేలాదిమంది వలంటీర్లలో సింహభాగం మంది నిబంధనలకు వ్యతిరేకంగా పనిచేస్తున్నారు. ఎక్కడికక్కడ నియోజకవర్గాల్లో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థుల ఇళ్లకు వెళ్లి వారితో రహస్య సమావేశాల్లో పాల్గొంటున్నారు. అలాగే అభ్యర్థుల ఆదేశాలతో తమ పరిధిలో కుటుంబాల వద్దకు వెళ్లి నిబంధనలకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నారు. ఇందుకుగాను వీరికి వైసీపీ అభ్యర్థులు భారీ ఆఫర్లు ఇస్తున్నారు. ఇప్పటికే కాకినాడ జిల్లాలోని తుని, పిఠాపురం, పెద్దాపురం, కాకినాడ సిటీ, కాకినాడ రూరల్, జగ్గంపేట తదితర నియోజకవర్గాల్లో వలంటీర్లకు అధికార పార్టీ నేతలు ఖరీదైన సెల్‌ఫోన్లు, వాచీలు, ఇతర గిఫ్ట్‌లు అందించారు. తమను గెలిపిస్తే ఎన్నికలు అయ్యాక రూ.లక్ష చొప్పున ఇస్తామంటూ ఆఫర్లు ఇచ్చారు. దీంతో ఎక్కడికక్కడ వలంటీర్లు యథేచ్ఛగా బరితెగించేస్తున్నారు. అభ్యర్థులు, వారి అనుచరులు నిర్వహిస్తున్న ఎన్నికల ప్రచారాలు, సమావేశాలకు నేరుగా హాజరవుతున్నారు. ఇంటింటికి వెళ్లి వైసీపీకి ఓటేయాలంటూ ప్రజలపై ప్రలోభాల వల విసురుతున్నారు. దీంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎక్కడికక్కడ వలంటీర్ల తీరు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. వైసీపీకి అనుకూలంగా పనిచేస్తున్న వీరిపై చర్యలు తీసుకోవాలంటూ ఇప్పటికే ప్రతిపక్షాలు ఎన్నికల కమిషన్‌కు వందల్లో ఫిర్యాదులు పంపాయి. ఇప్పటికే తునిలో వలంటీర్ల తీరుపై ఈసీకి ఫిర్యాదులు వెళ్లడంతో చర్యలకు రంగం సిద్ధమవుతోంది.

16 మంది వలంటీర్లపై వేటు

'సిద్ధం' కార్యక్రమాలకు తామూ సిద్ధమంటూ అత్యుత్సాహం ప్రదర్శించిన వలంటీర్లపై వేటు పడింది. ఎన్నికల కమిషన్ నిబంధనలు బేఖాతరు చేసిన వారిని పి.గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆదేశాలతో అంబాజీపేట ఇన్‌చార్జి ఎంపీడీవో కె.వరలక్ష్మి సస్పెండ్ చేశారు. అంబాజీపేట మండలం మొసలపల్లి, ఇరుసుమండల్లో 'సిద్ధం' పేరిట వైసీపీ నాయకులు సోమవారం నిర్వహించిన కార్యక్రమాల్లో ఆయా గ్రామాలకు చెందిన 16 మంది వలంటీర్లు పాల్గొన్నారు. మొసలపల్లిలో కొందరు వలంటీర్లు సీఎం జగన్ జై అంటూ నినాదాలు కూడా చేశారు. వైసీపీ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కోరుతూ ఓటర్ల జాబితాతో ఉన్న 'సిద్ధం' బ్యాగ్‌లను ముఖ్య నేతలు బూత్ కన్వీనర్లకు అందించారు. ఈ ఉదంతంపై మంగళవారం ఆంధ్రజ్యోతి కోనసీమ జిల్లా మెయిన్‌లో వచ్చిన వార్తకు అధికారులు స్పందించి సస్పెండ్ చేయడంతోపాటు ఎందుకు పాల్గొన్నారో మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని వలంటీర్లకు నోటీసులు ఇచ్చారు. - అంబాజీపేట

వైసీపీ సమావేశాలకు హాజరవుతున్న వలంటీర్లు

- ఎలక్షన్ కమిషన్ ఆంక్షలు బేఖాతర్
- రాజమహేంద్రవరం సిటీలో వైసీపీ సమావేశాలకు హాజరవడంపై అర్బన్ ఆర్వో దినేష్‌కుమార్ ఆగ్రహం
- హెచ్చరికలతో సరిపెట్టడంపై విమర్శలు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

వలంటీర్లు బరితెగిస్తున్నారు. ఎన్నికల సమయంలో వలంటీర్లను వాడుకోవద్దని ఎన్నికల కమిషన్ హెచ్చరించినా పట్టించుకోవడం లేదు. అధికార వైసీపీ నేతల ప్రలోభాలకు, ఒత్తిళ్లకు లొంగి వైసీపీ మీటింగ్‌లకు హాజరవుతున్నారు. అంతేకాక వైసీపీ అభ్యర్థులు కూడా వలంటీర్లతో ఇంటింట ప్రచారం చేయించడానికి, ప్రతీ లబ్ధిదారుడికి రూ.లక్షల్లో లబ్ధి చేకూరినట్టు కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం చేయించడానికి సన్నద్ధం చేశారు. గతంలో జీతం పెంచమని అడిగితే, సుమారు 100మందికిపైగా వలంటీర్లను సస్పెండ్ చేసిన అధికారులు, వారిలో మళ్లీ కొంతమందిని విధుల్లోకి తీసుకున్నారు. ఇటీవల వైసీపీ నేతలు నియోజకవర్గాల వారీ గిఫ్ట్‌లు పంపిణీ చేసిన సంగతి తెలిసిందే. ఇంకా ఎన్నికలు దగ్గరకు వచ్చే సమయంలో డబ్బు కూడా ఇస్తామని ప్రలోభాలు పెట్టి వాళ్ల చేత పనిచేయించుకునే పనిలో ఉన్నారు. రాజమహేంద్రవరం సిటీలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన తర్వాత కూడా సిటీ అభ్యర్థి మార్గాని భరత్ డివిజన్‌ల వారీ బూత్ ఇన్‌చార్జిలతో మీటింగ్‌లు పెడుతూ అక్కడకు వలంటీర్లను కూడా పిలుస్తున్నారని చెబుతున్నారు. ఈ విషయం బయటకు రావడంతో పాటు రాజమహేంద్రవరం అర్బన్ ఆర్వో, మున్సిపల్ కమిషనర్ దృష్టికి వెళ్లగా సుమారు 20 మందికిపైగా వలంటీర్లను పిలిచి హెచ్చరించడం గమనార్హం. వచ్చే నెలలో పింఛన్లు ఇచ్చే సమయంలో కూడా వలంటీర్లతో నేరుగా ఓటర్లకు వైసీపీకి ఓటు వేయమని చెప్పించడానికి ఆ పార్టీ నాయకులు ఒత్తిడి తెస్తున్నట్టు సమాచారం. ఇక రాజమహేంద్రవరం సిటీలో వైసీపీ నేతల సమావేశాలకు హాజరై, అధికారికంగా అధికారుల దృష్టిలో ఉన్నప్పటికీ వాళ్లను హెచ్చరించి వదిలేయడం ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించడమేననే వాదన మొదలైంది. సిటీలో వైసీపీ అభ్యర్థి పెట్టిన బూత్ కమిటీల మీటింగ్‌లకు హాజరైన సుమారు 20మందికి పైగా వలంటీర్లను మంగళవారం ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా ఉన్న మున్సిపల్ కమిషనర్ కె.దినేష్‌కుమార్ తన దగ్గరకు పిలిచి ఆగ్రహం వ్యక్తం చేశారు. సస్పెండ్ చేస్తానని, తీవ్ర చర్యలు తప్పవని, పోస్టు నుంచి తీసివేస్తామని హెచ్చరించినట్టు సమాచారం. ఎన్నికల కమిషన్ ఆదేశించినప్పటికీ, పట్టించుకోకుండా వలంటీర్లు వైసీపీ మీటింగ్‌కు వెళ్లడం ఉల్లంఘనే. అంతేకాదు... వారి మీద చర్యలు తీసుకోకపోవడం కూడా నియమావళి ఉల్లంఘన కిందకే వస్తుందని ఆరోపణలు వినవస్తున్నాయి. ఇప్పటికే కోనసీమ జిల్లాలో 16 మంది వలంటీర్లను సస్పెండ్ చేశారు. ఇప్పటికైనా వలంటీర్లు బరితెగింపు విధానాలు మానకపోతే ఇబ్బందుల్లో పడక తప్పదు.

వలంటీర్లకు తాయిలాలపై తునిలో విచారణ

తుని రూరల్, మార్చి 19: కాకినాడ జిల్లా తుని నియోజకవర్గంలో 1000మందికిపైగా వలంటీర్లకు, కొంతమంది పోలీస్ సిబ్బందికి సెల్‌ఫోన్‌లు పంపిణీ చేశారని, వెలుగు, మెప్మా పరిధిలో పనిచేస్తున్న సిబ్బందికి నగదు పంపిణీ చేశారని ఆరోపిస్తూ టీడీపీ నేతలు ఈసీకి ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని ఎన్నికల కమిషన్ సీరియస్‌గా తీసుకుంది. దీనిపై ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ ద్వారా వలంటీర్ల నుంచి వివరణ తీసుకోవాలని ఎంపీడీవోలకు ఆదేశాలు ఇచ్చారు.

జగన్ కటౌట్‌పై మాజీ ఎన్నికల కమిషనర్ ఫిర్యాదు



రాష్ట్రంలో ఎన్నికల నియమావళిని అపహాస్యం చేస్తున్నారంటున్నారు రాష్ట్ర ఎన్నికల సంఘం మాజీ కమిషనరు, సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ ప్రధాన కార్యదర్శి నిమ్మగడ్డ రమేష్‌కుమార్. మంగళవారం ఉదయం రాజమహేంద్రవరం నుంచి పశ్చిమగోదావరి జిల్లా తణుకు కారులో వెళ్తున్న ఆయన్ను ఆలమూరు మండలం జొన్నాడ జాతీయ రహదారిపై ఏర్పాటుచేసిన చెక్‌పోస్టు వద్ద ఆపి తనిఖీ చేశారు. ఈ సమయంలో ఆయనకు సీఎం జగన్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి కటౌట్ ఉన్న పెద్ద హోర్డింగ్ కనిపించింది. మధ్యాహ్నం తిరిగి వెళుతుండగా ఆయన జొన్నాడ వద్ద ఆగి ఆ హోర్డింగ్‌ను మీడియాకు చూపించారు. విషయం తెలుసుకున్న అధికారులు స్పందించి సాయంత్రం హోర్డింగును తొలగించారు. - ఆలమూరు

మోడల్ నియోజకవర్గంగా పిఠాపురాన్ని తీర్చిదిద్దుతా

- జనసేన అధినేత పవన్‌కల్యాణ్



అమరావతిలో జనసేనలో చేరిన పిఠాపురం నియోజకవర్గ నాయకులు

పిఠాపురం, మార్చి 19: ఏపీలోనే మోడల్ నియోజకవర్గంగా పిఠాపురాన్ని తీర్చిదిద్దుతానని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ తెలిపారు. మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో వైసీపీ, టీడీపీలకు చెందిన పలువురు నాయకులు జనసేనలో చేరారు. వీరందరికీ పవన్‌కల్యాణ్ జనసేన కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యే తలచుకుంటే నియోజకవర్గాన్ని ఏ విధంగా అభివృద్ధి చేయవచ్చో చేసి చూపిస్తానని చెప్పారు. గతంలో నోటాకు వేసిన వారంతా ఈసారి జనసేనకు వేయాలని కోరారు. పిఠాపురం రైతులు కన్నీరు కార్చకుండా చూసుకుంటానని, ఉప్పాడ చీరలకు ప్రత్యేకమైన మార్కెటింగ్ సౌకర్యం తీసుకువస్తానని తెలిపారు. నియోజకవర్గంలో ఉన్న యువతతోపాటు అన్నివర్గాల ప్రజలకు ఉపాధి కల్పిస్తామని చెప్పారు. ఉప్పాడ సముద్ర తీరప్రాంతం కోతవల్ల మత్స్యకారులు తీవ్రంగా నష్టపోతున్నారని, దీన్ని నిరోధించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎవరో రౌడీమూకలు వచ్చి పిఠాపురాన్ని భయపెడతానంటే ఊరుకునేది లేదని, ప్రతిఒక్కరికీ అండగా ఉంటానని ప్రకటించారు. వైసీపీ సమన్వయకర్త, ఎంపీ మిథున్‌రెడ్డిపై సెటైర్లు వేశారు. జనసేన పిఠాపురం ఇన్‌చార్జి ఉదయశ్రీనివాస్ ఆధ్వర్యంలో వైసీపీ మాజీ ఎంపీపీ కురుమళ్ల రాంబాబు, జిల్లా కార్యదర్శి మార్నీడి రంగబాబు, జల్లూరు ఉపసర్పంచ్ వీరంరెడ్డి చిన్ని, వీరంరెడ్డి చక్రి, మాజీ సర్పంచ్‌లు గంధం సత్యనారాయణ, కర్రెడ్ల తాతీలు, కుంపట్ల చల్లారావు, టీడీపీ నేతలు ఎలుబండి రాజారావు, జవ్వాది జోగేశ్వరరావుతోపాటు సూరవరపు కృష్ణార్జునరావు, మాలమహానాడు అధ్యక్షుడు బీఎస్ రాజు తదితరులు జనసేనలో చేరారు.

కాకినాడ జనసేన ఎంపీ అభ్యర్థిగా తంగెళ్ల ఉదయ్

- ప్రకటించిన పవన్‌కల్యాణ్



ఉల్లంఘనలు చూడరు

- వైసీపీ నేతలు చిత్రాలు, పేర్లు ఉన్నా తొలగించని తీరు
- ఎన్నికల కమిషన్ ఆదేశాలు పట్టకపోవడంపై విమర్శలు



తుని మండలం కొలిమేరువద్ద జగన్ ఫొటోతో స్వాగత బోర్డు

తుని రూరల్, మార్చి 19: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చి రోజులు గడుస్తున్నా ఎక్కడికక్కడ పార్టీలపరమైన చిత్రాలు,పేరు కనిపించడంతో విమర్శలకు తావిస్తోంది. కొంతమంది అధికారులు స్వామి భక్తి చాటుకునేందుకు ఎన్నికల సంఘం ఆదేశాలకు తూట్లు పొడుస్తున్నారన్న ఆరోపణలున్నాయి. సీఎం జగన్, ఆయన తండ్రి రాజశేఖర్‌రెడ్డి చిత్రాలు, పేర్లు పలుచోట్ల దర్శనమిస్తున్నాయి. తుని మండలం కొలిమేరువద్ద జగన్ ఫొటోతో స్వాగత బోర్డు ఉంది. పార్టీపరమైన ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు తొలగించాలని నిబంధనలు చెప్తున్నా అధికారులకు పట్టడం లేదు. దీనివెనుక ఓటర్లను ప్రభావితం చేసే ఉద్దేశ్యం ఉందని పలువురు చెబుతున్నారు.

బస్సులపై జగన్, ద్వారంపూడి బొమ్మలు

- కాకినాడ నగరంలో కోడ్ ఉల్లంఘించినా పట్టని వైనం



కాకినాడ నగరంలో ఉచిత బస్సులపై జగన్, ద్వారంపూడి చిత్రాలు

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 19: ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చినప్పటికీ సీఎం జగన్ బొమ్మలు తొలగించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. కాకినాడ నగరంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులను గమ్యస్థానాలను చేర్చేందుకు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఉచిత బస్సులను ఏర్పాటు చేశారు. ఇవి కాకినాడ నగరంలో పర్లోవపేట, దుమ్ములపేట, సంజీవ్ నగర్, సాంబమూర్తినగర్, సూర్యనారాయణపురం, డెయిరీఫారమ్,రాజీవ్‌గృహకల్ప వంటి ప్రాంతాల్లో విద్యార్థినులను సాలిపేట బాలికోన్నత పాఠశాలకు చేరుస్తాయి. ఎన్నికలప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చినా ఉచిత బస్సులపై ఉన్న సీఎం జగన్, కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి బొమ్మలను తొలగించకపోవడంతో విపక్షాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. విపక్ష నాయకుల బొమ్మలను తొలగించడంలో ఉన్న శ్రద్ధ అధికారపార్టీ నాయకుల బొమ్మలను తొలగించడంలో కనిపించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కళాశాలలోను కోడ్ ఉల్లంఘన

- కాకినాడ పీఆర్‌లో జాబ్ ఫెస్ట్



జాబ్ ఫెస్ట్ కోసం కళాశాలలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

కాకినాడ రూరల్, మార్చి 19: కాకినాడ పీఆర్ ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాలలో నోడల్ రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో మంగళవారం జాబ్‌ఫెస్ట్‌ను ప్రారంభించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున స్థానిక ఎమ్మెల్యే బంధువును పాల్గొనేలా చేయడంతో ఈ సమాచారం జిల్లా కలెక్టర్‌కు తెలియడంతో వారి ఆదేశాల మేరకు అకస్మాత్తుగా నిలిపివేశారు. జిల్లాలోని, మరికొన్ని ఇతర ప్రాంతాలలోని 9నోడల్ సెంటర్లనుంచి విద్యార్థులు జాబ్‌ఫెస్ట్‌కు హాజరయ్యారు. కళాశాలలో దీనికి సంబంధించిన ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతో పాటు కుర్చీలు, టెంట్లు ప్రాంగణంలో ఏర్పాటు చేసి విద్యార్థుల రిజిస్ట్రేషన్లు కూడా ప్రారంభించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా కనీసం కళాశాలల ప్రిన్సిపాల్స్ కానీ ఇతర విద్యాశాఖ ఉన్నతాధికారులుకానీ ఇలా రాజకీయ నాయకులకు కొమ్ము కాస్తూ జాబ్‌ఫెస్ట్ నిర్వహించడమేంటని ఎంతో ఘనచరిత్ర కలిగిన పీఆర్ కళాశాల దీనికి వేదిక కావడమేంటని విద్యావేత్తలు, కళాశాల పూర్వవిద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమం నిర్వహణకు అయ్యే ఖర్చును అవగాహనా రాహిత్యంతో వృథా చేశారు. దీనిపై కళాశాల ప్రిన్సిపాల్ తిరుపాణ్యాన్ని వివరణ కోరగా కళాశాల విద్య కమిషనర్ ఆదేశాల మేరకు జాబ్‌ఫెస్ట్‌ను ప్రారంభించామని, ఎన్నికల కోడ్ అమలులో ఉండగా నిర్వహించరాదని ఆదేశాలు రావడంతో జాబ్‌ఫెస్ట్‌ను వెంటనే నిలిపివేశామన్నారు.

ఎన్నికల నియమావళి పటిష్టంగా అమలు చేయాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో ఆదేశించిన ముఖేష్‌కుమార్ మీనా

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 19: రాష్ట్ర ఎన్నికల సంఘం సూచించిన మార్గదర్శకాలను, ఎన్నికల ప్రవర్తన నియమావళిని పటిష్టంగా అమలు చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ ముఖేష్‌కుమార్ మీనా ఆదేశించారు. ఆయన మంగళవారం విజయవాడ ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్‌సభ, శాసనసభ ఎన్నికలు ఒకే పర్యాయం జరుగుతున్నందున కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈవీఎంల ర్యాండమ్ మిషన్, సీ విజిల్ రిపోర్టు, సీజర్ మేనేజ్‌మెంట్, చెక్‌పోస్టు వద్ద తనిఖీలపై సూచనలు ఇచ్చారు. ఎన్నికల ప్రవర్తన నియమావళికి సంబంధించి తీసుకున్న చర్యలపై జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా వివరించారు. ఎన్నికల మార్గదర్శకాలను పటిష్టంగా అమలు చేస్తున్నామని ఆమె పేర్కొన్నారు. ఇప్పటికే ప్రభుత్వకార్యాలయాల్లో రాజకీయ నాయకుల ఫొటోలు తొలగించామన్నారు. ప్రధాన రహదారుల వెంబడి ఉన్న ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లను తొలగించామని బదులిచ్చారు. జిల్లాలో ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా అన్ని చర్యలు తీసుకున్నామని కమిషనర్‌కు తెలిపారు. కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి తిప్పేనాయక్, ఎన్నికల డీటీ జగన్నాథం పాల్గొన్నారు.

టెన్త్ హిందీ పరీక్షకు 27,712మంది హాజరు

కాకినాడరూరల్, మార్చి 19: పదోతరగతి పరీక్షలకు సంబంధించి మంగళవారం జిల్లావ్యాప్తంగా 137 కేంద్రాల్లో నిర్వహించిన హిందీ పరీక్షకు 28,264మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 27,712మంది హాజరైనట్లు డీఈవో పి.రమేష్ తెలిపారు. పరీక్ష ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటలవరకూ జరగ్గా డీఈవో 6, అసిస్టెంట్ కమిషనర్ 6, తనిఖీ అధికారులు 39పరీక్షాకేంద్రాలను తనిఖీ చేశారు. హిందీ పరీక్ష అన్ని కేంద్రాల్లోనూ ప్రశాంతంగా జరిగినట్లు డీఈవో తెలిపారు. ఆంగ్ల పరీక్షను బుధవారం నిర్వహించనున్నామన్నారు.



కాకినాడ భాష్యం పాఠశాల పరీక్షా కేంద్రం నుంచి పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

ఎన్నికల నియమావళి కచ్చితంగా పాటించాలి

- కమిషనర్ వెంకటరావు

కార్పొరేషన్(కాకినాడ), మార్చి 19: ఎన్నికల ప్రవర్తన నియమావళిని అన్ని రాజకీయ పార్టీలు కచ్చితంగా పాటించి సహకరించాలని కాకినాడ సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కమిషనర్ జె.వెంకటరావు కోరారు. కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం జరిగింది. ఇప్పటివరకు కొత్త ఓట్ల నమోదు, తొలగింపు, మార్పులు, చేర్పులకు సంబంధించిన సమాచారాన్ని ఆయా పార్టీల ప్రతినిధులకు వివరించారు. ఆర్వో మాట్లాడుతూ మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్‌ను పటిష్టంగా అమలు చేయడంలో ఆయా పార్టీల తోడ్పాటు ఎంతో అవసరమన్నారు. ఎక్కడైనా సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించాలంటే 48గంటల ముందుగా దరఖాస్తులు చేసుకోవాలని స్పష్టం చేశారు. సమావేశంలో రావూరి వెంకటేశ్వరరావు(వైసీపీ), మల్లిపూడి వీరు, తుమ్మల రమేష్(టీడీపీ), అప్పారావు(బీఎస్పీ), డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, తహసీల్దార్ దొర, ఎలక్షన్ డీటీ సీతాపతిరావు, డీసీపీ హరిదాసు, ఏసీపీ నాగశాస్త్రులు పాల్గొన్నారు.

చెక్‌పోస్టుల పరిశీలన

కాకినాడ సిటీ ముఖద్వారాల వద్ద ప్రతిపాదించిన చెక్‌పోస్టులను రిటర్నింగ్ అధికారి, కమిషనర్ జె.వెంకటరావు మంగళవారం పరిశీలించారు. ప్రతాప్‌నగర్ వంతెన, యానాం రోడ్డు, కుంభాభిషేకం ప్రాంతాల్లో చెక్‌పోస్టు ప్రదేశాలను అధికారులతో కలిసి సందర్శించారు. ఆయన వెంట ఎస్ఈ పి.సత్యకుమారి, ఈఈ మాధవి, డీఈలు లక్ష్మీ, లోవరాజు, ఏఈలు వై.నాగేశ్వరరావు, రమేష్ ఉన్నారు.

నోటి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

- నేడు ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవం

సామర్లకోట, మార్చి 19: నోటి ఆరోగ్యం అనేది ప్రతి వయస్సులో జాగ్రత్తగా కాపాడుకోవాలని నోరు శుభ్రంగా, ఆరోగ్యంగా ఉంటేనే మన శరీరం కూడా ఆరోగ్యంగా ఉంటుందని సామర్లకోట ప్రభుత్వాస్పత్రి దంత వైద్యాధికారిణి డాక్టర్ ప్రవీణ వెల్లడించారు. ఈనెల 20న బుధవారం ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నోటి ఆరోగ్యం ప్రాముఖ్యతను డాక్టర్ ప్రవీణ మంగళవారం వివరించారు. నాన్ కమ్యూనికబుల్ డిసీజ్‌లలో దంతక్షయం అనేది ప్రపంచంలో సమస్యగా మారిందన్నారు. దీన్ని నివారించేందుకు ప్రతిఒక్కరూ కొన్ని జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

- రోజుకు రెండుసార్లైనా 2నిమిషాలు బ్రష్ చేయాలి.
- అవసరమైన ఫ్లోరిడేటెడ్ పేస్ట్‌తో పళ్లను బ్రష్ చేసుకునేందుకు మెత్తటి బ్రష్‌ను మాత్రమే వాడాలి.
- మనం తీసుకునే ఆహారంలో(ఫ్రీ షుగర్) తగ్గించి భోజనం మధ్య స్వీట్లు తీసుకునే అలవాటు తగ్గించుకోవాలి.
- ఆల్కహాల్, ధూమపానం, కార్బొనేటెడ్ శీతల పానీయాలు వంటి వాటికి దూరంగా ఉండాలి.
- ప్రతి ఆరునెలలకు ఒకసారి దంతవైద్యుడితో పరీక్షలు చేయించుకోవాలి.
- పళ్లన్నీ పుచ్చిపోవడం, దంతాలు వదులుకావడం, నోటి దుర్వాసన ఎక్కువ కావడంవల్ల ఇన్‌ఫెక్షన్‌లు మిగిలిన భాగాలకు గుండెకు చేరడంవల్ల ఎండోకార్డైటిస్, డయాబెటిస్, కిడ్నీలు పాడవ్వడం, నోట్లో అల్సర్లు రావడం, బరువు తగ్గడం వంటి సమస్యలు ఏర్పడతాయి. అందుకే నోటి ఆరోగ్యానికి ప్రతి ఒక్కరూ ప్రాధాన్యమివ్వాలన్న పిలుపు మేరకు ఈ ఏడాది ఆరోగ్యవంతమైన నోరు-ఆరోగ్యవంతమైన శరీరం పేరిట ప్రభుత్వాస్పత్రుల్లో దంత వైద్యశిబిరాలు ఏర్పాటుచేసి నోటి ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్నారని డాక్టర్ ప్రవీణ తెలిపారు.

నరసన్న బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

నేడు కల్యాణోత్సవం.. రథోత్సవం

ధ్వజపతాన్ని ఎగురవేస్తున్న దృశ్యం





కోరుకొండ, మార్చి19: శతాబ్దాల చరిత్ర కలిగిన నవ నరసింహ క్షేత్రాల్లో ఒకటైన స్వయంభు కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దివ్య కల్యాణ మహోత్సవాలకు అంకురార్పణ జరిగింది. పాల్గుణ శుద్ధ దశమి మంగళవారం సాయంత్రం పుట్టమన్ను తీసుకు రావడంతో నరసన్న బ్రహ్మోత్స వాలకు శ్రీకారం చుట్టారు. శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని ప్రత్యేక పల్లకిలో ఆశీనులు గావించి మేళతా ళాలు, మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్ఛరణల మధ్య పుట్టమన్ను తీసుకురావడా నికి అనువంశిక ధర్మకర్త ఎస్పీ రంగరాజభట్టర్ ఆధ్వర్యంలో శ్రీ చక్రపెరుమాళ్లను తీసుకుని దేవుని కోనేరు వద్దకు వెళ్లారు. అక్కడ పవిత్రమైన పుట్టకు శాస్త్రోక్తంగా వైఖానస ఆగమ శాస్త్రం ప్రకారం ఆగమ బ్రహ్మ పాణింగిపల్లి పవన్‌కుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో పుట్టకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పుట్ట మన్ను సేకరించారు. పుట్టమన్ను తీసుకుని తిరిగి మంగళవా యిద్యాలతో లక్ష్మీనరసింహస్వామి దిగువ దేవస్థానం ఆలయ ముఖ మండపానికి చేరుకున్నారు. అక్కడ ఈ పుట్టమన్నును 9 రకాల మట్టి మూకిడిలో వేసి నవధాన్యాలు వేసి నరసన్న బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేశారు. అనంతరం స్వామి వారి ధ్వజ పతాన్ని ధ్వజ స్తంభం వద్ద ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శాస్త్రోక్తంగా ధ్వజారోహణం చేశారు. అం తకు ముందు స్వామి వారికి ప్రత్యేక హోమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలు అన్నవరం దేవస్థానం కార్యనిర్వహణాధికారి అదనపు కమిషనర్ కె.రామచంద్రమోహన్, ఎస్పీ రంగరాజభ ట్టర్, లక్ష్మీనరసింహభట్టర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్య క్రమంలో గ్రామ సర్పంచ్ కర్రి లక్ష్మీసరోజ, ఎంపీటీసీ కాళ్ల వీర బాబు, వైస్ ఎంపీపీ బొరుసు నాగమణి, అన్నవరం దేవస్థానం ట్రస్టు బోర్డు మెంబర్ తాడి రజనీ, మరో ట్రస్టు మెంబర్ కటకం బాబ్జి, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు బొండాడ చందు పాల్గొన్నారు.



కల్యాణానికి వేళాయె..

కోరుకొండ, మార్చి19: కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి దివ్య దంప తులకు, శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ అనంత పద్మనాభ స్వామి వారికి బుధ వారం రాత్రి 9 గంటలకు కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. ఆగమ పండితులు పాణింగపల్లి పవన్‌కుమార్ ఆచార్యులు బ్రహ్మత్వంలో వంశ పారంపర్య అర్చక స్వాములు పెదపాటి, పెద్దింటి, పెరవళి స్వీయ పర్యవేక్ష ణలో పాంచాహ్నిక దీక్షతో శ్రీ వైఖానస ఆగమ వైష్ణవ సంప్రదాయంలో అంగరంగ వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. వంశపారంపర్య ధర్మకర్త పరాసర భట్టర్ వంశీయులు, ఎస్పీ రంగ రాజభట్టర్, అన్నవరం వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి కె.రామచంద్రమోహన్ ఆధ్వర్యంలో స్వామి వారి దివ్య కల్యాణ మహోత్సవం అత్యంత వైభ వంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. కోరుకొండ దిగువ దేవస్థానం ఆలయ ప్రాంగణంలో స్వామి వారి కల్యాణ వేదికపై శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దివ్య కల్యాణ మహోత్సవం, లోక కల్యాణార్థం, భక్తజన సంరక్ష ణార్థం జరిపించనున్నట్లు రంగరాజభట్టర్ స్వామి తెలిపారు.భక్తులందరి స్వామి వారి దివ్య కల్యాణ మహోత్సవాలను కనులారా తిలకించి స్వామి వారి కృపాకటాక్షలకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

పండిత సభలు

రంగరాజస్వామివారి ఆలయ ప్రాంగణంలో విశిష్టాద్వైత పండిత సభలు ప్రారంభమవు తాయి. 5 రోజులు పాటు ఉభయ వేదాంత పండితులు ఉదయం, సాయంత్రం ఈ పండిత సభల్లో పాల్గొని భక్తులకు రామాయణ, భాగవ త ఆళ్వారుల దివ్య చరిత్ర గురించి ఉపన్యాసి స్తారు. ఈ కార్యక్రమాలు పరాసర లక్ష్మీనర సింహ భట్టర్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు.

రథోత్సవానికి ఘనంగా ఏర్పాట్లు

దారి త్రాత్మక కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి కల్యాణ మహోత్సవాలు సంద ర్భంగా కల్యాణానికి ముందు బుధవారం మధ్యాహ్నం 1.58 గంటలకు స్వామి వారి రథోత్సవం జరుగుతుంది.అంత కుముందు స్వామి వారిని పెండ్లి కుమారుడిగా, అమ్మవారిని పెండ్లి కుమార్తెగా అలంకరించి పండితులు నిర్ణయించిన శుభ ము హూర్తానికి పల్లకిపై తీసుకుని వచ్చి స్వామి వారి అతిపెద్ద పురాతన రథంపై స్వామి ఆశీనులు గావిస్తారు. అనంతరం రథానికి ముందు పూజలు చేస్తారు. తదుపరి అన్నాన్ని రాశిగా పోసి గుమ్మడికాయ కొట్టి రథాన్ని ముందుకు లాగుతారు. దీంతో రథోత్సవం ప్రారంభ మవుతుంది. సుమారు 4 గంటలు పాటు కోరుకొండ నాలుగు మాఢ వీధుల్లో వేలాది మంది భక్తుల గోవింద నామస్మరణల మధ్య లక్షలాది అరటిపండ్లు రథంపై వేస్తుంటే రథం ముందుకు సాగుతుంది.

సాగర తీరంలో డాల్ఫిన్ల సందడి



సర్పవరం జంక్షన్, మార్చి 19: కాకినాడ సాగర తీరంలో డాల్ఫిన్లు సందడి చేస్తు న్నాయి. సముద్ర తీరానికి సమీపంలో సముద్రం పై భాగంలో ఇవి పైకి తేలియాడు తూ..గాలిలోకి ఎగురుతూ చక్కర్లు కొట్టే విన్యాసాలు సందర్శకులకు కనువిందు చేస్తు న్నాయి. ఉమ్మడి జిల్లాలోనే ప్రముఖ పర్యాటక ప్రదేశంగా కాకినాడ బీచ్‌కు గుర్తింపు ఉంది. కాకినాడ సాగర తీరంలో సూర్యారావుపేట, నేమాం సముద్ర తీరంలో డాల్ఫిన్లు సందడి చేస్తున్నాయి. నిత్యం సుమారు 10 నుంచి 12 డాల్ఫిన్లు సముద్ర తీరానికి వచ్చి సందర్శకులకు కనువిందు చేస్తున్నాయి. డాల్ఫిన్లు సముద్రపు నీటి, నదీ జలాల్లో నివ సించే క్షీరదాలు. ఇవి చూసేందుకు ఎంతో ముద్దుగా ఆహ్లాదంగా కనిపిస్తాయి. డాల్ఫిన్లు మనుషులతో దగ్గరగా ఎంతో కలుపుగోలుగా ఉంటాయి. వీటికి మనిషి మాదిరిగా తెలి వితేటలు ఉన్నట్లు శాస్త్రవేత్తలు తమ అధ్యయనాల్లో పొందుపరిచారు. ఇవి సము ద్రంలో నివసిస్తూ అనుకూలమైన వాతావరణం ఉన్న సమయంలో సముద్ర తీరానికి వచ్చి సముద్రంలో పైకి వింత వింత శబ్దాలతో అరుస్తూ ఎగురుతూ విన్యాసాలు చేస్తుంటాయి. అరుదుగా కనిపించే డాల్ఫిన్లను చూసేందుకు బీచ్‌కు సందర్శకులు తర లివస్తున్నారు. గత వారం రోజులుగా కాకినాడ బీచ్‌లో సముద్ర తీరంలో డాల్ఫిన్లు సంచరించడంతో వీటి విన్యాసాలు చూసి ఫొటోలు తీసుకుంటున్నారు. మత్స్యకారులు అయితే సముద్రంలో ఈత కొడుతూ డాల్ఫిన్ల వద్దకు వెళ్లి వాటితో విన్యాసాలు చే యడం విశేషం. చిన్నారులు, పెద్దలకు ఆహ్లాదం, వినోదం అందించి అరుదైన డాల్ఫిన్లు ఇటీవల మృతి చెందుతున్నాయని సందర్శకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సము ద్రంలో విపరీతమైన కాలుష్యం పెరిగిపోవడం, చేపల వేట కోసం మత్స్యకారులు విని యోగించే మెకనైజ్డ్, మోటారైజ్డ్ బోట్ల ఇంజన్ రెక్కల్లో పడి డాల్ఫిన్లు మృత్యువాత పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అరుదైన డాల్ఫిన్ల సంరక్షణకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

నిత్యాన్నదానానికి విరాళం



దాతకు స్వామివారి చిత్రపటం

అంతర్వేది, మార్చి 19: అంతర్వేదిలో కొలువై ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్ కొంపల్లికి చెందిన కూనపరాజు సూర్యా వతి జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు పొ త్తూరి సుబ్బరాజుఝాన్సీలక్ష్మి రూ.2.71 లక్షలు విరాళంగా అందించారు. ఈ వి రాళాన్ని ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణకు అందించినట్లు దాతలు తెలిపారు. అనంతరం దాతలకు స్వా మివారి చిత్రపటం, ప్రసాదాలను ఆలయ అధికారులు అందించారు. కార్యక్రమంలో తనిఖీ అధికారి రామలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వాడపల్లి వెంకన్న కల్యాణోత్సవాలపై సమీక్ష

ఆత్రేయపురం, మార్చి 19: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవా లను విజయవంతంగా నిర్వహించాలని కొత్తపేట ఆర్డీవో జీవీవీ సత్యనారాయణ కోరారు. ఆలయంలో మంగళవారం ఆయన వివిధ శాఖల అధికారులతో ఉత్సవాల నిర్వహణపై సమీక్షిం చారు. ఏప్రిల్ 18 నుంచి 24 వరకు ఉత్సవాలు జరుగుతాయని, 19న తీర్థం, కల్యాణం, రథోత్సవాలను తిలకించేందుకు లక్షలాది మంది భక్తులు తరలివస్తారన్నారు. ప్రభుత్వ నోటిఫైడ్ ఫెస్టివల్ కావడంతో చేపడుతున్న ఏర్పాట్లపై ఆర్డీవో శాఖల వారీగా సమీక్షించారు. తాగునీరు, పారి శుధ్యం, ఆరోగ్య సేవలతో పాటు శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులు చేపట్టాల్సిన చర్యలు, ట్రాఫిక్, ట్రాన్స్‌పోర్ట్, విద్యుత్ శాఖల అధికారులతో తీసుకోవాల్సిన చర్యలపై మాట్లాడారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. శాఖల వారీగా చేపడుతున్న చర్యలను అధికారులు వివరించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో నిబంధన లకు అనుగుణంగా ఉత్సవాలు నిర్వహించాలన్నారు. ఉప కమిషనర్ భూపతిరాజు కిశోర్‌కుమార్, దేవదాయ శాఖ జిల్లా అధికారి నాగమల్లేశ్వరరావు, డీఎల్‌డీవో రాజేశ్వరరావు, సీఐ రామ్‌కుమార్, తహసీల్దారు వెంకటరామయ్య, ఈవోపీఆర్డీ శ్రీనివాస్, పరిపాలనాధికారి సురేంద్రరెడ్డి, వైద్యాధికారి సౌమ్య, ఆర్టీసీ డిప్యూటీ మేనేజర్ అచ్యుతాంబ పాల్గొన్నారు.

యువతిని నమ్మించి, మోసగించిన కేసులో

ఆర్పీఎఫ్ కానిస్టేబుల్‌కు ఏడేళ్ల జైలు శిక్ష

అమలాపురం రూరల్, మార్చి 19: యువతిని ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీర కంగా అనుభవించి ఆర్పీఎఫ్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం వచ్చిన తర్వాత కట్నం ఆశించి పెళ్లి చేసుకో కుండా మోసం చేసిన కేసులో ముద్దాయికి ఏడేళ్ల జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధిస్తూ రా జమహేంద్రవరం ఎనిమిదో ఏడీజే కోర్టు, క్రైమ్ ఎగెనెస్ట్ ఉమెన్స్ కోర్టు జడ్జి వై.బెన్నయ్యనాయుడు తీర్పు వెలువరించినట్లు పట్టణ సీఐ కె.క్రిస్టఫర్ మంగళవారం తెలిపారు. ఈ కేసుకు సంబంధిం చిన వివరాలు ఇలా ఉన్నాయి... డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ మండలానికి చెందిన యువతిని వన్నెచింతలపూడికి చెందిన పరమట వెంకటేశ్వర దొరబాబు, అ లియాస్ వెంకటదొరబాబు ప్రేమిస్తున్నానని వెంటపడి నమ్మించి శారీరకంగా అనుభవించాడు. కా లక్రమంలో అతడికి సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం రావడంతో కట్నం ఆశించి ఆ యువతిని మోసం చేసి మరో పెళ్లి చేసుకోవడానికి సిద్ధపడ్డాడు. సమాచారం తెలుసుకున్న యువతి 2019 జనవరి 17న అమలాపురం పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి సీఐ సీహెచ్ శ్రీ రామకోటేశ్వరరావు కేసు నమోదు చేయగా అనంతరం వచ్చిన సీఐ జి.సురేష్‌బాబు దర్యాప్తు చేప ట్టారు. దొరబాబు సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న సమయంలో అనుమతి తీసుకుని అరె స్టు చేసి రిమాండ్‌కు పంపించారు. రాజమహేంద్రవరం కోర్టులో వాదోపవాదాలు జరిగాయి. ప్రాసి క్యూషన్ తరపున అడిషనల్ పీపీ మారిశెట్టి వెంకటేశ్వరరావు వాదనలు వినిపించగా దొరబాబుపై నేరం రుజువు కావడంతో ఏడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.5వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ ఎస్.శ్రీధర్ హెచ్చరించారు. ఈ కేసులో నేరం రుజు వు చేయడానికి వచ్చిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

వ్యక్తిపై పోక్సో కేసు నమోదు

గండేపల్లి, మార్చి 19: కాకినాడ జిల్లా గండేపల్లి పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం పోక్సో కేసు నమోదైంది. గండేపల్లి పోలీసుల వివరాల ప్రకారం... గండేపల్లి గ్రామానికి చెందిన ప్రైవేట్ స్కూల్‌లో చదువుతున్న ఐదేళ్ల బాలికపై అదే స్కూల్‌కు ఆటోపై రోజు తీసుకెళ్తున్న డ్రైవర్ లైంగి క చర్యకు పాల్పడినట్లు బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశామన్నారు. కాకినాడ దిశా డీఎస్పీ ఆర్.రామచంద్రరావు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు గండేపల్లి పోలీసులు తెలిపారు.

ఆటోలో తరలిస్తున్న రూ.4.50 లక్షలు సీజ్

ద్రాక్షారామ, మార్చి 19: రామచంద్రపురం మండలం నరసాపురపుపేట వద్ద మంగళవా రం రాత్రి ఆటోలో తరలిస్తున్న రూ.4.50 లక్షల నగదును ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం స్వాధీ నం చేసుకుంది. వాహనాల తనిఖీల్లో భా గంగా కరప వైపు నుంచి రామచంద్రపురం వస్తున్న వాహనంలో సదరు మొత్తం పట్టు బడింది. నగదును రామచంద్రపురం పోలీసు లకు అప్పగించారు. దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

పూర్వ డీసీహెచ్‌ఎస్ రమేష్‌కిషోర్‌పై విజిలెన్స్ విచారణ

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 19: పూర్వ డీసీహెచ్‌ఎస్ డాక్టర్ టి.రమేష్‌కిషోర్‌పై విజిలెన్స్ విచారణ చేపట్టాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. రమేష్‌కిషోర్ రాజమ హేంద్రవరం డీసీహెచ్‌ఎస్‌గా పనిచేసిన సమ యంలో హాస్పిటల్‌లో మహిళా ఉద్యోగినిలపై వేధింపులకు పాల్పడుతున్నాడని, ఆసుపత్రి ఫండ్స్‌లో అవకతవకలు జరిగాయని గతంలో అడ్వకేట్ వెల్ఫేర్ సొసైటీ తరుపున న్యాయవా దులు గొట్టిముక్కల అనంతరావు, ధర్నాల కోట వెంకటేశ్వరావు ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ప్రభుత్వం విచా రణకు ఆదేశించింది. విచారణాధికారిగా విజ యనగరం డీసీహెచ్‌ఎస్ డాక్టర్ బి.గౌరిశంకర రావును నియమించింది. ఈ మేరకు బుధ వారం కొవ్వూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో విచారణ నిర్వహించనున్నట్లు డీసీహెచ్‌ఎస్ డాక్టర్ సనత్‌కుమారి పేర్కొన్నారు.

కాకినాడ జనసేన ఎంపీ అభ్యర్థిగా తంగెళ్ల ఉదయ్

- మంగళగిరిలో పార్టీ నేతల సమావేశంలో ప్రకటించిన పవన్
- ఎంపీ అభ్యర్థి ఎవరనేదానిపై సస్పెన్స్‌కు తెర
- స్వయంగా పవన్ బరిలోకి దిగవచ్చని కొంతకాలంగా బలంగా ప్రచారం
- పవన్ పిఠాపురం వైపు మొగ్గుచూపడంతో బరిలోకి దిగే నేతపై ఉత్కంఠ
- ఎట్టకేలకు తంగెళ్ల వైపు మొగ్గు..సానాకు దక్కని చాన్స్



పవన్‌కల్యాణ్, నాగబాబుతో ఉదయ్‌శ్రీనివాస్

(ఆంధ్రజ్యోతి, కాకినాడ): ఎట్టకేలకు సస్పెన్స్ వీడింది. కాకినాడ జనసేన ఎంపీ అభ్యర్థి ఎవరనే దానిపై కొంతకాలంగా నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. పార్టీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి, టీ టైం అధినేత తంగెళ్ల ఉదయ శ్రీనివాస్‌ను ఎంపీ అభ్యర్థిగా పవన్ మంగళవారం ప్రకటించారు. వాస్తవానికి కాకినాడ ఎంపీ సీటు నుంచి టీడీపీ అభ్యర్థి బరిలోకి దిగుతారని తొలుత చర్చ జరిగింది. కానీ పొత్తు నేపథ్యంలో టికెట్‌ను జనసేన దక్కించుకుంది. దీంతో పలువురు పోటీకి సిద్ధమైనా అసలు అభ్యర్థి ఎవరనేదానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. స్వయంగా పవన్ బరిలోకి దిగుతారంటూ కొంతకాలం విస్తృతంగా చర్చ నడిచింది. కానీ తాను పిఠాపురం నుంచి పోటీ చేస్తానని పవన్ ఇటీవల ప్రకటించడంతో కొంత గందరగోళానికి తెరపడింది. పిఠాపురం నుంచి టికెట్ ఆశించిన నియోజకవర్గ ఇంఛార్జి తంగెళ్లకు ఎంపీ అభ్యర్థిగా పవన్ చాన్సిచ్చారు. కాగా ఈ సీటును సానా సతీష్ ఆశించారు. కానీ పవన్ మాత్రం తంగెళ్లవైపే మొగ్గు చూపారు.

అక్కడ లేదని..ఇక్కడ చాన్స్

కాకినాడ ఎంపీ స్థానం నుంచి తమ పార్టీ తరఫున అభ్యర్థిని సిద్ధం చేసిన టీడీపీ, తీరా జనసేనతో పొత్తు కుదరడంతో కాకినాడ సీటు వదులుకుంది. దీంతో కాకినాడ ఎంపీ అభ్యర్థిగా ఎవరిని బరిలోకి దించుతారనేదానిపై పెద్ద చర్చ జరిగింది. ఉమ్మడి తూ.గో. జిల్లాలో కాకినాడ పార్లమెంట్ పరిధిలో తమ పార్టీకి బలం ఎక్కువగా ఉందని, సామాజిక సమీకరణాల కోణంలోను ఇక్కడి నుంచి ఎంపీ అభ్యర్థిని ఎవరిని నిలబెట్టినా విజయం సాధిస్తామనే అంచనాలు జనసేనలో నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో పొత్తులో భాగంగా ఏరి కోరి కాకినాడ ఎంపీ సీటును జనసేన ఖాయం చేసుకుంది. దాదాపు అన్ని స్థానాల్లో టీడీపీ కూటమి అభ్యర్థులపై స్పష్టత వచ్చినా కాకినాడ ఎంపీ అభ్యర్థి ఎవరనేదానిపై చాలా కాలంగా స్పష్టత లేకుండా పోయింది. బీజేపీతో పొత్తు కుదిరిన నేపథ్యంలో ఆ పార్టీ ఒత్తిడి మేరకు పవన్ ఎంపీగా బరిలోకి దిగవచ్చని ప్రచారం జరిగింది. అదే సమయంలో పిఠాపురం సీటును కూడా పొత్తులో భాగంగా దక్కించుకున్న జనసేన ఇక్కడ కూడా అభ్యర్థి ఎవరనేదానిపై తేల్చలేదు. దీంతో కాకినాడ ఎంపీ, పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థులు ఎవరనేదానిపై సస్పెన్స్ నెలకొంది. ఈరెండు స్థానాల్లో పవన్ బరిలోకి దిగొచ్చనే అంచనాలు నెలకొన్నాయి. మరోపక్క పిఠాపురం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న తంగెళ్ల శ్రీనివాస్ తాను ఇక్కడి నుంచి బరిలో ఉంటానని గతంలో పవన్‌కు స్పష్టత ఇచ్చారు. దీంతో పిఠాపురం నుంచి తంగెళ్ల, ఎంపీ అభ్యర్థిగా పవన్ బరిలో ఉండొచ్చనే విశ్లేషణలు జనసేనలో కొనసాగాయి. కానీ ఇటీవల అనూహ్యంగా పవన్ తాను పిఠాపురం నుంచి బరిలో ఉంటానని స్వయంగా ప్రకటించారు. దీంతో ఈ స్థానం ఆశిస్తోన్న తంగెళ్లకు చాన్స్ లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో మంగళవారం తంగెళ్లను ఎంపీ అభ్యర్థిగా ప్రకటించి అందరినీ ఆశ్చర్యపరిచారు. దీంతో కొంతకాలంగా కొనసాగుతున్న సస్పెన్స్‌కు తెరపడ్డట్లయింది. కాగా ఎంపీ అభ్యర్థిగా పవన్ ప్రకటించిన ఉదయ శ్రీనివాస్ కడియం ప్రాంతానికి చెందిన నేత. టీ టైం అధినేతగా ఉంటూ గతేడాది జనసేనలో చేరారు. పవన్‌కల్యాణ్ పిఠాపురం నియోజకవర్గంలో వారాహి యాత్ర నిర్వహించిన అనంతరం తంగెళ్లను ఇన్‌చార్జిగా నియమించారు. కాగా మంగళవారం మంగళగి రిలో పిఠాపురం నియోజకవర్గం నుంచి వివిధ పార్టీల నాయకులు పవన్ సమక్షంలో జనసేనలో చేరారు. ఈ సందర్భంగా పవన్ తంగెళ్లను ఎంపీ అభ్యర్థిగా ప్రకటించారు. తాను బరిలో ఉండాల్సిందేనని, కానీ ఎందుకు పిఠాపురం వెళ్లాల్సి వచ్చిందనేదానిపైనా పవన్ స్పష్టత ఇచ్చారు. బీజేపీ కేంద్ర నాయకత్వం తనను ఎంపీగా పోటీ చేస్తావా, ఎమ్మెల్యేగా వెళ్లతావా అని అడిగారని ఎమ్మెల్యేగా పోటీ చేసి అసెంబ్లీలో అడుగుపెడతానని చెప్పానని, ముందు రాష్ట్రానికి తర్వాత దేశానికి సేవ చేయాలని ఉందని వివరించానంటూ తన అంతరంగాన్ని ప్రక టించారు.

ఇక ఎన్నికల రణమే..

కాకినాడ ఎంపీ అభ్యర్థిగా టీడీపీ తరపున బరిలోకి దిగడానికి గతేడాది నుంచి కాకినాడకు చెందిన వ్యాపారవేత్త సానా సతీష్ ప్రయత్నాలు చేశారు. లోకేశ్ యువగళం పాదయాత్ర, చంద్రబాబు రా.. కదలిరా సభల్లోను ఆయన అన్నివిధాలా ముందుండి పనులు చక్కబెట్టారు. కానీ కాకినాడ ఎంపీ సీటును పొత్తులో భాగంగా జనసేనకు ఇవ్వాల్సి రావడంతో సతీష్ రాజకీయ భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. టికెట్ జనసేనకు వెళ్లినా అభ్యర్థిని మాత్రం తానే అవుతానని సానా ఇంతకాలం భావించారు. కొంతకాలం కిందట పవన్‌ను కలిసి తన మనసులో మాట చెప్పారు. త్వరలో తన పేరు కాకినాడ జనసేన ఎంపీ అభ్యర్థి లిస్ట్‌లో ఉంటుందని భావించారు. కానీ సీటు తంగెళ్లను వరించింది. కాకినాడ పార్లమెంటు పరిధిలో కాకినాడ అసెంబ్లీ మినహా మిగిలిన ఆరు స్థానాల్లో తెలుగుదే శం, జనసేన పార్టీ అభ్యర్థులపై ఇప్పటికే స్పష్టత రావడంతో ఇక కదన రంగంలోకి ఇరుపార్టీల నేతలు వెళ్లనున్నారు. ఇప్పటికే తుని, జగ్గంపేట, పెద్దాపురం, ప్రత్తిపాడు టీడీపీ అభ్యర్థులు యనమల దివ్య, జ్యోతుల నెహ్రూ, నిమ్మకాయల చినరాజప్ప, వరుపుల సత్యప్రభలు, కాకినాడ రూరల్ జనసేన అభ్యర్థి పంతం నానాజీ విస్తృతంగా ప్రచార కార్యక్ర మాలు నిర్వహిస్తున్నారు. వివిధ పార్టీల నుంచి భారీ చేరికలతో పాటు ప్రజలకు వద్దకు వెళ్లి మద్దతు కూడగట్టడంలో నిమగ్నమయ్యారు. పిఠా పురం నుంచి జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పోటీ చేయనుండడంతో ఆ ప్రభావం ఏడు నియోజకవర్గాలపై ఉంటుందని భావిస్తున్నారు.

స్కూల్ బస్సు ఢీకొని అంగన్‌వాడీ చిన్నారి మృతి

దివాన్‌చెరువు, మార్చి 19 : రాజానగరం పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాలచర్ల గ్రామంలో ప్రైవేట్ స్కూల్ బస్సు ఢీకొని అంగన్‌వాడీ కేంద్రంలో చదువుతున్న బండి శ్రీవల్లి(4) అనే చిన్నారి మృతి చెందింది. మంగళ వారం ఉదయం అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చిన చిన్నారి మధ్యాహ్నం భోజన సమయంలో మరో ఇద్దరు చిన్నారులతో కలసి ఆయా సహాయంతో మూత్ర విసర్జనకు బయటకు వచ్చింది. బాలిక వెంట వచ్చిన ఇద్దరు చిన్నారులు ముందుగా మూత్ర విసర్జన అనంతరం కేంద్రానికి బయలుదేరి వెళ్లడంతో వారికోసం ఆయా చిన్నారి శ్రీవల్లీని వదిలి ముందుకు వెళ్లింది. ఈ నేపథ్యంలో అటుగా అతివేగంగా వస్తున్న ప్రైవేట్ స్కూల్ బస్ శ్రీవల్లీని ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన బాలికను చికిత్స నిమిత్తం రాజమండ్రిలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈమేరకు ఎస్ఐ పవన్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల భారంతో ఉరేసుకుని ఆత్మహత్య

రాజానగరం, మార్చి 19 : అప్పుల భారంతో మండలంలో నరేంద్రపురం గ్రామానికి చెందిన మద్దూరి శ్రీను(47) చెట్టుకు ఉరే సుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామానికి చెందిన శ్రీను గతంలో ఫ్రూట్స్ వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల ఫైనాన్స్ ద్వారా వరికోత యంత్రాన్ని కొనుగోలు చేశాడు. దీనికితోడు ఇంటి నిర్మాణం, కుమార్తె వివాహం చేసి, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఈ నేపథ్యంలో అప్పుల భారం అధికం కావడం, తీర్చే మార్గం లేకపోవడంతో కొంతకాలంగా కూలి పనులకు వెళుతూ కుటుంబాన్ని పోషించు కుంటున్నాడు. కుమార్తె నిండు గర్భిణి కాగా కుమారుడు తండ్రికి చేదోడు వాదోడుగా ఉంటున్నాడు. దీంతో మనస్తాపం చెందిన శ్రీను చేసేది లేక మంగళవారం చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సంఘటనా స్థలాన్ని రాజానగరం పోలీసులు పరిశీలించి, పంచనామా అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రాజానగరం సీఐ పి.కాశీవిశ్వనాథ్ తెలిపారు.

విజిలెన్స్ అధికారుల తనిఖీలు

రూ.5.07 లక్షల విలువైన పెట్రోల్, డీజిల్ స్వాధీనం



తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

అమలాపురం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి)/రాయవరం: విజిలెన్స్ అధి కారులు మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయ వరం మండలం సోమేశ్వరం గ్రామంలోని శ్రీవీరవెంకట సత్యనారాయ ణ సామిల్ అండ్ ట్రాన్స్‌పోర్టు కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పె ట్రోల్ బంకులో తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్, లీగల్ మెట్రాలజీ, రెవెన్యూ, సివిల్ సప్లయిస్ అధికారులతో కలిసి తనిఖీలు చేపట్టారు. నయారా ఎనర్జీ లిమిటెడ్ ఫ్రాంచైజ్ వారితో ఒప్పందాన్ని రద్దు చేసుకు న్న తర్వాత కూడా అదే పేరుతో డీలర్ స్టాకును విక్రయిస్తున్నాడు. అంతే కాకుండా నయారా ఎనర్జీ లిమిటెడ్ ఫ్రాంచైజ్ రద్దు విషయం జాయింట్ కలెక్టర్ దృష్టికి కూడా తీసుకురాలేదు. పెట్రోల్ బంకులోని ఎయిర్ మిషన్ పనిచేయట్లేదు. అగ్నిమాపక యంత్రాలు రీఫిల్ చేయ లేదు. సివిల్ సప్లయి అధికారులు ఆ బంకు నుంచి రెండు నమూనా లను విశ్లేషణ నిమిత్తం సేకరించారు. ఒప్పందం రద్దు చేసుకున్న తర్వాత కూడా డీలర్ స్టాకును విక్రయిస్తున్న కారణంగా, స్టాకు రిజిస్ట ర్ నిర్వహించకపోవడంతో రాయవరం సివిల్ సప్లయిస్ అధికారులు రూ.5,07,715 విలువ గల 3158 లీటర్ల పెట్రోలు, 1686 లీటర్ల డీజిల్ స్టాకును స్వాధీనం చేసుకుని బంకు యాజమాన్యంపై 6(ఎ) కేసు న మోదు చేసినట్టు విజిలెన్స్ ఎస్పీ కేఎస్‌ఎస్వీ సుబ్బారెడ్డి మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. పెట్రోలు బంకుల యజ మానులు అనుమతులు లేకుండా అమ్మకాలు జరిపినా, నాణ్యతా ప్ర మాణాలు పాటించకపోయినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిచారు. తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు ముత్యాలనాయుడు, నా గవెంకటరాజు, విజయ్‌కుమార్, అలీషా పాల్గొన్నారు.

వైసీపీ నాయకులపై కేసు నమోదు

ద్రాక్షారామ, మార్చి 19: రామచంద్రపురం మండలం వె లంపాలెంలో ఎన్నికల నియమావళి ఉల్లంఘించి గ్రామ స చివాలయంలో సమావేశం జరపడంపై ఎంపీడీవో ఇచ్చిన ఫిర్యాదు మేరకు ద్రాక్షారామ పోలీసులు సోమవారం రాత్రి కేసు నమోదు చేశారు. వెలంపాలెం సర్పంచ్ భర్త టేకు మూడి సత్యనారాయణ మరో 9 మంది వైసీపీ నాయకులు గ్రామ సచివాలయంలో సోమవారం ఉదయం 10 గంట లకు సమావేశమయ్యారు. వెలంపాలెం ఎంసీసీ సభ్యులు వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి, మహిళా పోలీసులు ఎన్నిక ల నియమావళి అమలులో ఉన్నదని చెప్పినప్పటికీ సమా వేశం కొనసాగించారు. దీనిపై ఎంసీసీ సభ్యులు ఎంపీడీవో కు ఫిర్యాదు చేయగా ఎంపీడీవో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ద్రాక్షారామం ఇన్‌చార్జి ఎస్ఐ కేసు నమోదు చేశారు.

కాకినాడ

వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

పిఠాపురం, మార్చి 19: టీటీడీ నిర్వహణలో పిఠాపురంలో ఉన్న పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు మంగళవారం అంకురార్పణ జరిగింది. ఉదయం సుప్రభాత సేవ, అభిషేకం, దీక్షా తిరుమంజనం జరిగాయి. రాత్రి వేదపండితుల మంత్రోశ్చారణల మధ్య విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, దీక్షాకంకణం, రుత్విక్‌వరుణం, అంకురార్పణ నిర్వహించారు. ఆలయ అధికారి ఎం.సందీప్, అర్చకులు తదితరులు ఉన్నారు.

ప్రజాగళం సభ భద్రతా వైఫల్యంపై విచారణ చేపట్టాలి

టీడీపీ నేతలు రాజప్ప, నెహ్రూ డిమాండ్

సామర్లకోట, మార్చి 19: దేశ ప్రధాని నరేంద్ర మోదీ హాజరైన చిలకలూరిపేట బొప్పూడి ప్రజాగళం సభలో భద్రతలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీసు ఉన్నతాధికారులపై ఛీఫ్ ఎన్నికల కమీషన్ అధికారులు తక్షణం చర్యలు తీసుకోవాలని తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప డిమాండ్ చేశారు. మంగళవారం రాత్రి సామర్లకోట మండలం అచ్చంపేటలోని ఎమ్మెల్యే స్వగృహంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ లక్షలాది మంది జనం తోసుకొస్తుంటే ని యంత్రించాల్సిన పోలీసులు చోద్యం చూడడం దేనికి సంకేతం అని పోలీసు ఉన్నతాధి కారులను సూటిగా ప్రశ్నించారు. బీజేపీ, టీడీపీ, జనసేన తొలి ఎన్డీఏ సభ నభూతో నభవిష్యత్తు అన్నట్లు విజయవంతమైందన్నారు. అయితే ట్రాఫిక్ స్తంభన వల్ల వేలాది మంది కార్యకర్తలు సభకు రాలేకమధ్యలోనే ఇరుక్కున్నారన్నారు. లక్షలాది మంది ప్రజలు హాజరైన సభకు పోలీసులు ఇచ్చే భద్రత ఇదేనా అని ప్రశ్నిస్తూ కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించిందన్నారు. స్తంభాలపైకి ఎక్కినవారు దిగాలని వారిని స్థానిక పోలీసులు నియంత్రించాలని స్వయంగా ప్రధాని మోదీయే చెప్పాల్సివచ్చిం దంటే పోలీసుల వైఖరి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. ప్రధాని సభలో క్రౌడ్ మేనేజ్‌మెంట్ బాధ్యత ఎవరిది అని ప్రశ్నించారు. అధికారులను ఏర్పాటుచేసి, జనాన్ని నియంత్రించాల్సిన బాధ్యత సీనియర్ పోలీసు అధికారులకు లేదా అన్నారు. ప్రధాని భద్రత, జనం, ట్రాఫిక్ నియంత్రణ వంటి అంశాలను పోలీసు బాస్‌లు ఎందుకు పట్టించు కోలేదో ఛీఫ్ ఎలక్షన్ కమిషనర్ సమగ్ర విచారణ చేపట్టాలన్నారు.

జగ్గంపేట: దేశ ప్రధాని నరేంద్రమోదీ చిలకలూరిపేటలో హాజరైన ప్రజాగళం సభ భద్రతా వైఫల్యంపై విచారణ చేపట్టాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీస్ ఉన్నతాధి కారులపై ఛీఫ్ ఎలక్షన్ కమిషన్ తక్షణం చర్యలు తీసుకోవాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ డిమాండ్ చేశారు. జగ్గంపేటలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ లక్షలాది మంది జనం తోసుకుంటే నియంత్రించాల్సిన పోలీసులు చోద్యం చూడఛిం దేనికి సంకేతమని ప్రశ్నించారు. ట్రాఫిక్ జామ్ వల్ల వేలాది మంది సభకు రాలేకపోయారన్నారు. ప్రధాని సభ వైపు జనం తోసుకుంటే నియంత్రించాల్సిన బాధ్యత పోలీసులకు లేదా, ఫోల్స్ ఎక్కినవారు దిగాలని, స్థానిక పోలీసులు నియంత్రించాలని ప్రధానే చెప్పారంటే పోలీసుల వైఖరి ఎలా ఉందో అర్థమవుతుందన్నారు. జగన్‌రెడ్డి ప్రభుత్వంలో పనిచేస్తున్న కొందరు అధికారులు ఉద్దేశపూర్వకంగానే సభకు అడ్డంకులు సృష్టించేందుకు ప్రయత్నించారని వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పిఠాపురంలో మున్సిపల్ అధికారుల అత్యుత్సాహం

హనుమాన్ జెండాలు తొలగింపు

పిఠాపురం, మార్చి 19: పట్టణంలో మున్సిపల్ అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించారు. ఎన్నికల కోడ్ పేరిట మత సంబంధమైన జెండాలను తొలగించడంతో స్థానికులు, వీహెచ్‌పీ ప్రతినిధులు అభ్యంతరం తెలిపి ఆందోళనకు దిగారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో తప్పు జరిగిందంటూ పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు లిఖితపూర్వకంగా రాసి ఇచ్చారు. పట్టణంలోని జగ్గయ్యచెరువు తదితర ప్రాంతాల్లో పలు ఇళ్లపై హనుమాన్ జెండాలు ఉన్నాయి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి రావడంతో రాజకీయ పార్టీల జెండాలను మున్సిపల్ అధికారులు తొలగింపు ప్రారంభించారు. అదేవిధంగా గృహాలపై ఉన్న హనుమాన్ జెండాలను తొలగించడం వివాదానికి దారి తీసింది. బీజేపీ జెండాలంటూ వాటిని తొలగించడంతో పాటు కత్తిరించి మట్టిలో పడవేయడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విశ్వహిందూ పరిషత్, భజరంగదళ్ ప్రతినిధి వెంకటేశ్వరరావు మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నాకు దిగారు. హనుమాన్ జెండాల ఏర్పాటుకు అనుమతి తీసుకోవాలని కమిషనర్ చెప్పడంపై వారు మండిపడ్డారు. మున్సిపల్ అధికారుల తీరుపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. చివరకు కిందస్థాయి సిబ్బంది అవగాహన లోపంతో హనుమాన్ జెండాలు తొలగించడం పొరపాటేనని, ఇటువంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని లిఖితపూర్వకంగా వీహెచ్‌పీ ప్రతినిధులకు సమాచారం ఇచ్చారు.

టీడీపీ కార్యకర్తలతో బాబా ఆత్మీయ సమావేశం

సర్పవరం జంక్షన్, మార్చి 19: కాకినాడ రూరల్ పెనుమర్తిలో మంగళవారం టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాస బాబా పార్టీ నాయకులు,కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ కష్టకాలంలో ఉన్న సమయంలో అధిష్టానం ఆదేశాల మేరకు అప్పగించిన అన్ని కార్యక్రమాలతో పాటూ ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. పార్టీ, తనపై ఉన్న అభిమానంతో ఐదేళ్లపాటు తనతో వెన్నంటి ఉన్న కార్యకర్తలు, అభిమానులకు అన్ని విధాలుగా అండగా ఉంటానన్నారు. పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు, లోకేష్‌లను కలుసుకుని భవిష్యత్తు కార్యాచరణపై దృష్టి పెట్టడం జరుగుతుందన్నారు. సమావేశంలో మాజీ జడ్పీటీసీ కాకరపల్లి సత్యవతి చలపతిరావు, మాజీ ఎంపీటీసీ కొండా వినాయక్, గుబ్బల బాలాజీ పెంకే శ్రీను, కాకరపల్లి రాఘవులు, చింతపల్లి శ్రీను పాల్గొన్నారు.

లంపకలోవలో టీడీపీ ఆత్మీయ సమావేశం

ప్రత్తిపాడు, మార్చి 19: మండలంలోని లంపకలోవ గ్రామంలో మంగళవారం టీడీపీ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ పంది మణికుమారి దొరబాబు, గ్రామపెద్దలు చెక్కపల్లి మందేశ్వరరావు, బూరయ్య, శెట్టి సుబ్బారావు మాట్లాడుతూ జరగబోవు అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి వరుపుల సత్యప్రభరాజాను అఖండ మెజార్టీతో గెలిపించేందుకు శ్రేణులు కృషి చేయాలని తీర్మానించారు. గంటా అబ్బాయి, పి.చిట్టిబాబు, చీకట్ల చిట్టిబాబు, అడపా సత్యనారాయణ, సమిటి అమ్మిరాజు, రెడ్డి వెంకటేష్ పాల్గొన్నారు. చినశంకర్లపూడిలో టీడీపీ గ్రామ కమిటీ నాయకులు బాబు షూరిటీ భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మిరియాల శ్రీను, బద్దేటి మురళి, మిరియాల వెంకట్రాజు, బద్దేటి శ్రీను, చనుబోయిన నాగేశ్వరరావు, దుర్గ, కొట్టేటి బాబురావు, మహేంద్ర సూరిబాబు పాల్గొన్నారు.

రేపు టీడీపీ, జనసేన ఆత్మీయ కలయిక సదస్సు

సామర్లకోట, మార్చి 19: పెద్దాపురం నియోజకవర్గ తెలుగుదేశం, జనసేన కూటమి పార్టీల కార్యకర్తల, నాయకుల ఆత్మీయ కలయిక సదస్సు ఈనెల 21న సాయంత్రం 4 గంటలకు సామర్లకోట ప్రసన్నాంజనేయ స్వామి విగ్రహం ఎదురుగా హర్షా కల్యాణ మండపం ఆవరణలో జరుగుతుందని జనసేన నాయకులు సరోజావాసు వెల్లడించారు. మంగళవారం సామర్లకోటలో విలేకర్లతో మాట్లాడుతూ జనసేన అధిష్టానం ఇటీవల నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి తుమ్మల బాబుతో సమీక్షించిన మేరకు రానున్న ఎన్నికల్లో టీడీపీతో జనసేన కలిసి పనిచేసి విజయం సాధించాలన్న లక్ష్యం మేరకు ఈ సదస్సు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సదస్సులో పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, తుమ్మల బాబు, టీడీపీ, జనసేన రాష్ట్ర నాయకులు పాల్గొంటారన్నారు. జనసేన నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొనాలని సరోజా వాసు కోరారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సు సర్వీసు

ఏలేశ్వరం, మార్చి 19: ఏలేశ్వరం నుంచి అరుణాచలానికి ప్రత్యేక బస్సు సర్వీసు ఏర్పాటు చేస్తున్నట్లు డిపో మేనేజర్ జివి.సత్యనారాయణ తెలియజేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ అరుణాచల యాత్రలో భాగంగా ప్రత్యేక బస్సు సర్వీసు ఈనెల 23 శనివారం మధ్యాహ్నం ఏలేశ్వరం డిపో నుంచి బయలుదేరి కాణిపాకం, శ్రీపురం, కంచి, ద్వారకా తిరుమల, శ్రీకాళహస్తి క్షేత్రములు దర్శించుకోవడంతో పాటు ఫాల్గుణ మాస పౌర్ణమి సందర్భంగా అరుణాచల గిరి ప్రదక్షణ పూర్తయిన తరువాత తిరిగి 26న మంగళవారం ఏలేశ్వరం చేరుకుంటుందన్నారు. అల్ట్రా డీలక్స్ బస్సును ఏర్పాటు చేస్తున్నామని, టికెట్ ధర ఒక్కరికి రూ.3450 నిర్ణయించామన్నారు. టికెట్లు కోసం ఆన్లైన్ (ఏటిబి ఏజెంట్స్)లో అందుబాటులో ఉన్నాయని, ఈఅవకాశాన్ని ఏలేశ్వరం పరసర ప్రాంత ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9959225532, 9392266087, 9948234667 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

'ఒడిగోస్'కు ఇండియా ఎక్స్‌లెన్స్ అవార్డు

సర్పవరం జంక్షన్, మార్చి 19: నిరుద్యోగ యువత, నిరుపేదలకు అందిస్తున్న నాణ్యమైన సేవలకు గుర్తింపుగా రమణయ్యపేట ఏపీఎస్పీకి చెందిన వీజేఎస్ఎంఆర్ ఒడిగోస్ సంస్థకు ఇండియా ఎక్సలెన్స్ అవార్డు లభించింది. ఇటీవల బెంగళూరు తాజ్‌హోటల్లో నిర్వహించిన ఇండియా ఎక్సలెన్స్-2024 అవార్డుల ప్రదానోత్సవంలో అవార్డు తీసుకున్నట్టు ఒడిగోస్ సంస్థ మేనేజింగ్ పార్టనర్ వారా వినోద్ తెలిపారు. వినోద్‌ను సీవైఫ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ మూర్తిరాజు, స్టేట్ ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ జంగా గగారిన్, డాక్టర్ పీవీవీ సత్యనారాయణ, వి.ఏసుదాసు, డాక్టర్ వంశీకృష్ణ రాజా అభినందించారు.

'గ్యాస్ ఏజెన్సీ అక్రమాలపై చర్యలు తీసుకోవాలి'

గొల్లప్రోలు, మార్చి 19: గొల్లప్రోలు పట్టణంలోని ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ అక్రమాలపై చర్యలు తీసుకోవాలని అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య, ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా శాఖల ప్రతినిధులు కుంచే అంజిబాబు, వల్లూరి రాజబాబులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గొల్లప్రోలు తహశీల్దారు కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించి తహశీల్దారు ఉదయభాస్కర్‌కు వినతిపత్రం అందజేశారు. ఉజ్వల పథకంలో ఉచితంగా సిలిండర్ అందివ్వాల్సి ఉండగా రూ.300లను ఎటువంటి రశీదు ఇవ్వకుండా వసూలు చేస్తున్నారని వారు తెలిపారు.

'మౌలిక వసతుల కల్పనకు చర్యలు'

కొత్తపల్లి, మార్చి 19: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీవో పి.వెంకటనారాయణ తెలిపారు. మంగళవారం కొత్తపల్లి, అమినాబాదు, మూలపేట పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రతీ పోలింగ్ స్టేషన్‌లో విద్యుత్తు, ర్యాంప్‌లు, ప్రహరీ, తాగునీరు తదితర సౌకర్యాలు కల్పించినట్టు తెలిపారు.

టీడీపీ, జనసేన కూటమితోనే అభివృద్ధి

- ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప
- వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు



టీడీపీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న రాజప్ప



తుని రూరల్: టీడీపీలోకి ఆహ్వానిస్తున్న యనమల

పెద్దాపురం, మార్చి 19: టీడీపీ, జనసేన కూటమితోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. స్థానిక సుధా కాలనీల ఉన్న క్యాంప్ కార్యాలయం వద్ద సామర్లకోటకు చెందిన పలువురు చినరాజప్ప సమక్షంలో వైసీపీని వీడి టీడీపీలో చేరగా వారికి ఆయన పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం రాజ్ప మాట్లాడుతూ యువత రాజకీయాల్లోకి రావాలని, తద్వారా అభివృద్ధి సాధ్యమన్నారు. టీడీడీ, జనసేన యువతను ప్రోత్సహిస్తోందని, యువతకు ఉపాధి కల్పించే దిశగా అడుగులేస్తున్నట్టు చెప్పారు. ఇప్పటికే వైసీపీ విధానాలతో ప్రజలు విసిగిపోయారని, త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమికి పట్టం కట్టాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే చినరాజప్ప తనయుడు నిమ్మకాయల రంగనాగ్, రాజాసూరిబాబురాజు, అడబాల కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లను అడ్డుకోండి..

నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారంలో అక్కడక్కడ కొంతమంది వలంటీర్లు పాల్గొంటున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పెద్దాపురం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి జె.సీతారామారావుకు ఫిర్యాదు చేశారు. పార్టీ ప్రచార కార్యక్రమాల్లో వలంటీర్లు పాల్గొనకూడదని ఎన్నికల కమిషన్ కచ్చితమైన ఆదేశాలు జారీ చేసిందని, ఆదేశాలను దిక్కరించి వలంటీర్లు వైసీపీ సేవలో తరిస్తున్నారని, అటువంటి వారిపై కఠిన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

గెలుపే లక్ష్యం

తుని రూరల్, మార్చి 19: గెలుపే లక్ష్యంగా టీడీపీ శ్రేణులు పనిచేయాలని శాసనమండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు అన్నారు. తేటగుంట యనమల స్వగృహంలో గవరపేటకు చెందిన పలువురు వైసీపీ కార్యకర్తలు ఆ పార్టీకి రాజీనామా చేసి గజ్జి అప్పలరాజు, చోద్రాజు చిరంజీవిరాజు ఆధ్వర్యంలో టీడీపీలోకి చేరారు. వారికి యనమల పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరినవారిలో పర్లమర శెట్టి చంద్రరావు, ఆళ్ళ నాగేశ్వరరావు,వేగి గోవిందు, దాడి నాగరాజు, 20 కుటుంబాలు ఉన్నాయి. కార్యక్రమంలో గజ్జి రాంబాబు, కొల్లు సత్యనారాయణ, పేరూరి కృష్ణ, పలువురు టీడీపీకి నాయకులు పాల్గొన్నారు.

కూటమితో మెరుగైన పాలన

తొండంగి, మార్చి 19: టీడీపీ, జనసేన కూటమితో ప్రజలకు మెరుగైన పాలన అందుతుందని టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి యనమల కృష్ణుడు అన్నారు. మంగళవారం ఒంటిమామిడి పార్టీ కార్యాలయంలో కొమ్మనాపల్లి వైసీపీకి చెందిన పలువురు గ్రామ టీడీపీ నేత కోన రాంబాబు ఆధ్వర్యంలో టి.శివ, ఎస్ శివ,కాకి హరిబాబు, బత్తిన దుర్గాప్రసాద్, కుర్రా అయ్యప్ప స్వామి, బత్తుల రాజు టీడీపీలో చేరగా కృష్ణుడు పార్టీ కండవాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. రాష్ట్రంలో ప్రశాంత వాతావరణం ఏర్పడి ప్రజలు స్వేచ్ఛగా తమ కార్యకలాపాలు సాగించే రోజులు త్వరలోనే రాబోతున్నాయన్నారు. కార్యకర్తలంతా ఐక్యంగా పనిచేసి పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మండలాధ్యక్షులు చొక్కా అప్పారావు, తెలుగు రైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పేకేటి హరికృష్ణ, చొక్కా కాశీ, తాటిపర్తి శ్రీను పాల్గొన్నారు.

300 మంది చేరిక

రౌతులపూడి, మార్చి 19: మల్లంపేట గ్రామంలో 300 మంది వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు. టీడీపీ నాయకులు శీరంరెడ్డి లోవరాజు, బంగారు సోమినాయుడు, శీరంరెడ్డి శ్రీను ఆధ్వర్యంలో శీరంరెడ్డి శ్రీను, శెట్టి సత్యనారాయణ, జిగిరెడ్డి సూరిబాబు, గాడి కన్నబాబు, గోర్రిపాటి రామచంద్రరావు తదితరులకు ప్రత్తిపాడు ఉమ్మడి అభ్యర్థి వరుపుల సత్యప్రభ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. సత్యప్రభను గజమాలతో సన్మానించారు. టీడీపీ మండలాధ్యక్షుడు తమరాల సత్యనారాయణ, ఎంపీపీ గంటిమళ్ల రాజేశ్వరి, మాజీ ఎంపీపీ ఇటంశెట్టి సూర్యభాస్కరరావు, పైలా సాంబశివరావు, మదుసూరి మురళీకృష్ణ, పర్వత సురేష్, గొల్లు పెద్దదివాణం, ఈగల సత్తిబాబు, లవుడు నాగేశ్వరరావు ఉన్నారు.



తొండంగి: టీడీపీ కండువాలు కప్పుతున్న కృష్ణుడు



రౌతులపూడి: టీడీపీలో చేరుతున్న కార్యకర్తలు

జగన్ దుర్మార్గ పాలన ముగింపునకు సిద్ధం

కాకినాడ రూరల్ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి పంతం నానాజీ, టీడీపీ కో-ఆర్డినేటర్ పిల్లి సత్తిబాబు

వేములవాడ(కరప), మార్చి 19: జగన్ దుర్మార్గపు పాలనను ముగింపు పలికేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి పంతం నానాజీ, టీడీపీ కో-ఆర్డినేటర్ పిల్లి సత్తిబాబు, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని వేములవాడలో మంగళవారం కూటమి పార్టీ నాయకులతో కలిసి వారు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను వివరించి గాజుగ్లాసు గుర్తుపై ఓటేసి ఉమ్మడి అభ్యర్థి నానాజీని గెలిపించాలని విజ్ఞప్తిచేశారు. వైసీపీ పాలనలో అధోగతిపాలైన రాష్ట్రాన్ని బాగుచేయడం కోసం కూటమి ఏర్పడిందనే విషయాన్ని ప్రజలు గుర్తించారన్నారు. ప్రజాబలంతో కూటమి ప్రభుత్వం ఏర్పడుతుందని వారు ఆశాభావం వ్యక్తంచేశారు. పలువురు వైసీపీ నాయకులు జనసేనలో చేరగా కండువాలు కప్పి వారిని పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు గుల్లిపల్లి శ్రీనివాసరావు, పీజీ సత్యనారాయణ (బాబులు), బోగిరెడ్డి కొండబాబు, గంగాధర్, పాలిక సూరిబాబు, అప్పనపల్లి నారయ్య, మామిడాల వెంకటేష్, తుమ్మలపల్లి మాచరరావు, పంతం సందీప్, తూము బన్ను, రెడ్డి వీరవెంకటసత్యనారాయణ తదితరులున్నారు.

జనసేన కార్యాలయం ప్రారంభం

స్థానిక బజార్‌సెంటర్‌లో మంగళవారం జనసేన పార్టీ కార్యాలయాన్ని కాకినాడరూరల్ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి పంతం నానాజీ, టీడీపీ కో-ఆర్డినేటర్ పిల్లి సత్తిబాబు, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి లాంఛనంగా ప్రారంభించారు. జనసేన నాయకులు భారీ గజమాలలతో వారిని సత్కరించి మెమెంటోలను అందజేశారు. పలువురు జనసేనలోకి చేరగా వారందరికీ నానాజీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు బోగిరెడ్డి కొండబాబు, గంగాధర్, తుమ్మలపల్లి మాచరరావు, కర్నాసుల పుష్పరాజు, పబ్బినీడి వెంకటకృష్ణ, దేవు వెంకన్న, దూడల నారాయుడు, మద్దూరి స్వామి, పట్టాభి, రెడ్డి రమణేశ్వర్, వెలుగుబంట్ల శ్రీనివాస్, ముమ్మిడి పెదకాపు, యాళ్ల పండు పాల్గొన్నారు. కాగా అనుమతి రాకుండా జనసేన పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించడంపై మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అధికారి, ఎంపీడీవో కొంకి అప్పారావు నోటీసులు జారీ చేశారు. 24గంటల్లోగా అనుమతులు చూపాలని, లేకపోతే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

జనసేనలో చేరిన గట్టి రవి

జనసేన అధినేత పవన్ కల్యాణ్ సమక్షంలో ఆ పార్టీలో చేరినట్టు కరప మండల టీడీపీ సీనియర్ నేత గట్టి రవి తెలిపారు. మంగళగిరిలోని జనసేన కార్యాలయంలో మంగళవారం మిత్రులతో కలిసి పవన్‌ను కలవగా కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా



ప్రచారం చేస్తున్న నానాజీ, సత్తిబాబు, అనంతలక్ష్మి

ఆహ్వానించినట్టు రవి తెలిపారు. కాకినాడ ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

'వైసీపీ మునిగిపోయే నావ'

సర్పవరం జంక్షన్, మార్చి 19: వైసీపీ పాలనలో అన్ని రంగాల్లో రాష్ట్రం అధోగతి పాలైందని, వైసీపీ మునిగిపోయే నావ అని, ఒక్కొక్కరు పార్టీని వీడి జనసేన పార్టీలో చేరడమే ఇందుకు నిదర్శనమని, రాష్ట్రాభివృద్ధి టీడీపీ-జనసేన ఉమ్మడి ప్రభుత్వంతోనే సాధ్యమని కాకినాడ రూరల్ ఉమ్మడి అభ్యర్థి పంతం నానాజీ అన్నారు. వలసపాకల గంగరాజునగర్ జనసేన కార్యాలయంలో కొవ్వాడ వైసీపీకి చెందిన సీనియర్ నాయకులు కోటిపల్లి శ్రీను, స్వామినగర్‌కు చెందిన నాయకులు నున్న శంకర్‌లతో సుమారు 150 మంది అనుచరులతో జనసేనలో చేరగా నానాజీ పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. పాండ్రంగి రాజు, పాలిక రమణ, శిరంగు శ్రీనివాసరావు, తాటికాయల వీరబాబు తదితరులు ఉన్నారు.

నష్ట పరిహారాన్ని మింగేసిన ఎమ్మెల్యే

మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు



అధికారులతో మాట్లాడుతున్న కొండబాబు

కలెక్టరేట్ (కాకినాడ), మార్చి 19: మత్స్యకారులకు చెందాల్సిన వెయ్యి కోట్ల రూపాయిల నష్ట పరిహారాన్ని సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి అడ్డంగా దిగమింగేశారని మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ఆరోపించారు. ఓఎన్జీసీ నిర్వహిస్తున్న సిస్మిక్ సర్వే వల్ల మత్స్యకారులకు నష్టం కలుగుతుందని, మత్స్యకారులకందరికీ సమాచారం ఇవ్వకుండా కొందరితో సమావేశం నిర్వహించారని ఆయన మంగళవారం కలెక్టరేట్‌లో బైఠాయించి నిరసన నిర్వహించారు. ఏటిమొగ, దుమ్ములపేట, పర్లోవపేటల్లో ఉన్న బోటు యజమానులకు సమాచారం ఇవ్వకుండా జిల్లా కలెక్టరేట్‌లో రహస్యంగా ఎలా సమావేశం నిర్వహించారని ప్రశ్నించారు. కేవలం వైసీపీ నాయకులు, కొంతమంది పేటీఎం బ్యాచ్‌తో సమావేశం తూతూమంత్రంగా నిర్వహించారని ఆరోపించారు. ఓఎన్జీసీ, రిలయన్స్ సంస్థలు మత్స్య కారుల జీవనోపాధి కోసం ఐదేళ్లుగా ఇస్తున్న నష్టపరిహారాన్ని జగన్‌రెడ్డి అండదండలతో ద్వారంపూడి దోచుకున్నారని ఆరోపించారు. మత్స్యకారులతో మరోసారి సమావేశం నిర్వహించి మత్స్యకారుల డిమాండ్లను పరిష్కరించాలన్నారు. జిల్లాలో సిస్మిక్ సర్వే వల్ల నష్టపోతున్న మత్స్యకార కుటుంబాలకు తక్షణమే పరిహారం ఇవ్వాలని కొండబాబు డిమాండ్ చేశారు. లేకపోతే నిరసన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. దీంతో కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో డీఆర్వో తిప్పేనాయక్ కొండబాబుతో మాట్లాడారు. మరోసారి సమావేశం నిర్వహించి మత్స్యకారుల సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బోటు యజమానుల ప్రతినిధులు సంగాని నాగేశ్వరరావు, మల్లాడి రాజు, వనమాడి కోయిరాజు, రేకాడి లోవరాజు, ఎరుపిల్లి రాము, చోడిపిల్లి సతీష్, మూగు రాజు, చిరంజీవి, కొప్పాడి సత్యనారాయణ,రేకాడి ఆంజనేయులు,పంతాడి శ్రీను ఉన్నారు.

'లేనిపోని ఆరోపణలు చేస్తున్నారు'

ఎన్నికల్లో సీటు వస్తుందనే ఆశతోనే మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని మత్స్యకార సంఘం ప్రతినిధులు ధ్వజమెత్తారు. కాకినాడ లంగర్‌రేవు లోడింగ్ పాయింట్ వద్ద మత్స్యకార ప్రతినిధులు వాసుపల్లి కృష్ణ, కాటాడి సత్యనారాయణ, పాలపు నూకరాజు, ఓలేటి నూకరాజు, దండుపోలు వెంకట్రావులు విలేకర్లతో మాట్లాడుతూ మత్స్యకారులకు రావాల్సిన పరిహారం వెయ్యి కోట్లరూపాయిలు ఎమ్మెల్యే ద్వారంపూడి కాజేశారని చేసే ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. ఓఎన్జీసీ ఇచ్చిన నిధులు దుర్వినియోగం అయ్యాయని వనమాడి నిరూపిస్తే తాము ఎవ్వరినైనా నిలదీస్తామని హెచ్చరించారు. నెల రోజుల్లో కమిటీ నివేదిక ఇచ్చిన తర్వాత తమకు న్యాయం జరుగుతుందనే నమ్మకం ఉందన్నారు. సమావేశంలో మత్స్యకార సంఘాల నాయకులు కామిడి కనకాద్రి, చెక్కా శ్రీను, పి.రాంబాబు. వరిపిల్లి బలరామ్, సూరాడ శ్రీను పాల్గొన్నారు.

సైకో పాలన నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవాలి : వర్మ

పిఠాపురం, మార్చి 19: సైకో జగన్ పాలన నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ తెలిపారు. పిఠాపురం టీడీపీ కార్యాలయంలో మంగళవారం జరిగిన నియోజకవర్గ ఎస్సీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీని తరిమికొట్టేందుకు జనసేన, బీజేపీతో తెలుగుదేశం పార్టీ పొత్తు పెట్టుకుందన్నారు. అందులో భాగంగా జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పిఠాపురంలో పోటీ చేస్తున్నందున భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మాజీ జడ్పీటీసీలు మడికి ప్రసాద్, బత్తుల చైతన్యరాజేష్, ఎస్సీ సెల్ అధ్యక్షులు నూతాటి ప్రకాష్, బత్తిన మురళీ, దొమ్మేటి మనోహర్, బత్తిన శ్రీనివాస్, మాతా మాధవి, దుర్గాడ విజయలక్ష్మి, రాజామణి వేమగిరి రాంబాబు, ఎర్రంశెట్టి శ్రీను, మొర్త చినపండు తదితరులు ఉన్నారు.

'ఎన్నికల నిబంధనలు పాటించాలి'

పెద్దాపురం, మార్చి 19: ప్రింటింగ్ ప్రెస్ యాజమానులు ఎన్నికల నిబంధనలు కచ్చితంగా పాటించాలని నియోజకవర్గ ఎన్నికల ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో జె.సీతారామారావు పేర్కొన్నారు. ఆర్డీవో కార్యాలయంలో నియోజకవర్గంలో ప్రింటింగ్ ప్రెస్ యజమానులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ప్రింటింగ్ ప్రెస్ యాజమానులు పాంప్లెట్స్, స్టిక్కర్లు, పోస్టర్లు, ఫ్లెక్స్ ప్రింటింగ్ చేసేవారందరూ ఈసీ సూచించిన నిబంధనలు పాటించాలన్నారు. ప్రింట్ చేసిన తరువాత పబ్లిషర్ పేరు, ఎన్ని కాపీలు ప్రింట్ చేశారో వివరాలు స్పష్టంగా తెలియచేయాలని, డిక్లరేషన్ ఇవ్వాలన్నారు. ప్రింటింగ్ ప్రెస్‌కు సంబంధించి అనుమతి పత్రాలు కలిగి ఉండాలన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆర్డీవో కార్యాలయంలో కంప్లైంట్స్ మోనటరింగ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు సీతారామారావు తెలిపారు. రాజకీయ పార్టీలు, ప్రజల ఫిర్యాదులకు 08852 241254కు ఫోన్ చేయవచ్చన్నారు.

ఎన్నికల నియమావళిని పాటించాలి

ప్రత్తిపాడు, మార్చి 19: జరగబోవు ఎన్నికల్లో ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు ప్రవర్తనా నియమావళిని రాజకీయ పార్టీలు, నాయకులు, అభ్యర్థులు పాటించాలని ప్రత్తిపాడు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.శ్రీనివాసరావు చెప్పారు. తహశీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై అవగాహన సమావేశం నిర్వహించారు. పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి, సీఐ శేఖర్‌బాబు, తహశీల్దార్ నరసింహారావు, ఎస్ఐలు పవన్‌కుమార్, సతీష్, నియోజకవర్గంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

వర్క్‌షాప్‌ల నిర్వహణ అభినందనీయం

జేఎన్టీయూకే, మార్చి19: పరిశ్రమలకు అవసరమైన, భద్రతాపరమైన అంశాలకు సంబంధించి ఇటువంటి వర్క్‌షాప్‌ల నిర్వహణ అభినందనీయమని ఖతార్‌లోని ఆరిక్స్ జీటీఎల్ సంస్థ ప్రతినిధి డాక్టర్ రేఖపల్లి శ్రీనివాసరావు అన్నారు. వర్శిటీలోని అలూమ్నీ ఆడిటోరియంలో ఓడీఎల్ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో యూసీఈకే పీఈ,సీఈ విభాగం, జేఎన్టీయూకే ఎస్‌పీఈ, ఎప్ఐపీఐల సహకారంతో ప్రాసెస్ సేఫ్టీ ఎలిమెంట్స్ అప్లికేషన్స్ ఇన్ ఆయిల్,గ్యాస్ ఇండస్ట్రీస్‌పై మంగళవారం వర్క్‌షాప్ న్విహించారు. శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పరిశ్రమలలో భద్రత, పాటించే విధానాలపై వివరించారు. ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్, ప్రొఫెసర్ బీవీ రావు, డాక్టర్ మురళీకృష్ణ, అనుబంధ కళాశాలల 400 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

బాబు ష్యూరిటీ కార్యక్రమం

ఏలేశ్వరం, మార్చి 19: మండలంలోని పెద్దనాపల్లిలో ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రత్తిపాడు టీడీపీ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభ హాజరయ్యారు. టీడీపీ, జనసేన, బీజేపీ మేనిఫెస్టోలను ఇంటింటికి పంచారు.

ఎంసీసీ బృందం తనిఖీలు



జెండా స్తంభానికి తెలుపురంగు పూస్తున్న బృందం

సామర్లకోట, మార్చి 19: పట్టణ పరిధిలో ఎన్నికల నియమనిబంధనలు అమలు చేయడం లేదన్న పలువురి ఫిర్యాదుల మేరకు మంగళవారం మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ బృందం అధికారులు పలు ప్రాంతాల్లో సందర్శించారు. ఎంపీడీవో శ్యామ్‌సుందర్, జాస్తి రామారావు, ఈవోపీఆర్డీ హరికృష్ణసత్యారెడ్డి తదితర బృందం పోలీసులు వీడియో కెమెరాలతో పలు ప్రాంతాల్లో ఇంకా రాజకీయ నాయకుల, పార్టీల ఫ్లెక్సీలు, గోడపత్రికలు ఉండడాన్ని గుర్తించి ప్రత్యేక సిబ్బంది సాయంతో వాటిని తక్షణం తొలగించారు. అలాగే ఆంధ్రజ్యోతిలో మంగళవారం ప్రచురితమైన ఎన్నికల నిభందనలు పట్టవా పేరిట కథనానికి ఎంసీసీ అధికారులు స్పందించారు. ఆయా కూడలి ప్రాంతాల్లో రాజకీయ పార్టీలకు జెండా స్తంభాలకు తెలుపురంగు పులిమారు. వ్యాపార దుకాణాల పైనా కూడా అధికార పార్టీకి చెందిన హోర్డింగ్‌లను తొలగించారు. ఐసీడీఎస్ శాఖలో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, హక్కుదారులకు ప్రభుత్వం నుంచి మంజూరైన పాలు, కందిపప్పు, వేరుశెనగ చిక్కీలపై ప్రభుత్వ పరమైన ప్రచారం ఉండడాన్ని నిరోధించేందుకు గాను సరఫరాను నిలిపివేశారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘన



పాతర్లగడ్డ వద్ద వంతెనకు పులిమిన వైసీపీ రంగులు

కరప, మార్చి 19: అధికారుల ఉదాసీన వైఖరితో ఎక్కడికక్కడ యదేచ్ఛగా ఎన్నికల కోడ్ ఉల్లంఘన జరుగుతోంది. కరప మండలం పాతర్లగడ్డ వద్ద కేఎంజే కెనాల్‌పై నిర్మించిన వంతెనకు వైసీపీ రంగులు వేశారు. వాటిని తొలగించాల్సిన అధికారయంత్రాంగం చూసీచూడనట్టు వ్యవహరించడంపై పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. గొర్రిపూడిలో పలు శిలాఫలకాలకు ఎటువంటి ఆచ్ఛాదన లేదు. స్థానిక ఎంపీటీసీ ఇంటి ముందు అధికారపార్టీ ఫ్లెక్సీను ఇంకా తొలగించలేదు.



సుబ్బయ్యమ్మపేటలో స్తంభాలకు ఉన్న ఫ్లెక్సీలు

గండేపల్లి: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చి 4రోజులైనా సుబ్బయమ్మపేటలో ఇంకా వైసీపీ ఫ్లెక్సీలు తొలగించలేదు. విద్యుత్ స్తంభాలకు చాలా చోట్ల బ్యానర్లు కనిపిస్తున్నాయి.

ఉచిత ఎమ్‌సెట్ కోచింగ్

పిఠాపురం, మార్చి 19: నియోజకవర్గంలోని పేద విద్యార్థుల కోసం వర్మాస్ కావ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎమ్‌సెట్ ఇంజనీరింగ్, మెడికల్ విభాగాల్లో ఉచిత కోచింగ్ ఇవ్వనున్నట్టు పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ తెలిపారు. అనువజ్ఞులైన అధ్యాపకులతో శిక్షణతో పాటు ఉచిత మెటీరియల్ అందిస్తారని చెప్పారు. ఆధార్, ఇంటర్ హాల్ టిక్కెట్టు జిరాక్స్‌లతో పట్టణంలోని రాజావారికోటలో గల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పేరును ఎన్‌రోల్ చేసుకోవాలని, ఇతర వివరాలు కోసం 8978869999, 08869255555లో సంప్రదించాలని కోరారు.

తాళ్ళూరు తిరునాళ్లకు బందోబస్తు

గండేపల్లి, మార్చి 19: మండలంలో తాళ్ళూరు జియ్యన్న మఠంలో బుధవారం జరిగే తిరునాళ్లకు వేలసంఖ్యలో భక్తులు తరలిరానున్నారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జగ్గంపేట సీఐ లక్ష్మణరావు ఆధ్వర్యంలో గండేపల్లి ఎస్ఐ రామకృష్ణ నేతృత్వంలో 40మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తిరునాళ్లంతా ఎక్కడా ట్రాఫిక్ అంతరాయం కలగకుండా, అవాంఛనీయ సంఘటనలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆలయ ఈవో రాజేష్ మాట్లాడుతూ భక్తుల తొక్కిసలాట లేకుండా దర్శనార్థం క్యూలైన్లు, అలాగే పలు సౌకర్యాలు ఏర్పాటు చేశామని చెప్పారు.

'ఓటర్లు ప్రలోభాలకు లొంగవద్దు'

రౌతులపూడి, మార్చి 19: ఓటర్లు ప్రలోభాలకు లొంగకుండా స్వచ్ఛందంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని అన్నవరం ఎస్ఐ వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం మండలంలోని పారుపాక, రౌతులపూడి, ఎస్. పైడిపాల గ్రామాల్లో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించి ప్రజలకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు.

పదో తరగతి పరీక్షలు

సామర్లకోట, మార్చి 19: సామర్లకోట పట్టణం, మండలంలోనూ పదో తరగతి పరీక్షల్లో భాగంగా రెండోరోజైన మంగళవారం 9 పరీక్షా కేంద్రాలోనూ హిందీ పరీక్ష ప్రశాంతంగా జరిగిందని మండల విద్యాశాఖాధికారి వై. శివరామకృష్ణయ్య వెల్లడించారు. మొత్తం 1,640 మంది విద్యార్థులకుగాను 1,598 మంది హాజరయ్యారని, 42 మంది గైర్హాజరయ్యారని చెప్పారు. పరీక్షా కేంద్రాల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ ఎంవీవీగోపాలరావు తదితర బృందం తనిఖీలు చేపట్టారు.

36 మంది గైర్హాజరు

ప్రత్తిపాడు, మార్చి 19: మండలంలో మంగళవారం ప్రత్తిపాడు, ధర్మవరం, ఒమ్మంగి, లంపకలోవ పరీక్ష కేంద్రాల్లో నిర్వహించి పదో తరగతి హిందీ పరీక్షకు 36 మంది గైర్హాజరయ్యారు. 888 మంది పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా 852 మంది హాజరైనట్టు ఎంఈవో వి.రాజబాబు తెలిపారు.

పరీక్షా కేంద్రాల తనిఖీ

పెద్దాపురం, మార్చి 19: పదవ తరగతి పరీక్షా కేంద్రాలను ఆర్డీవో జె.సీతారామారావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్థానిక జేఎన్ఎం మున్సిపల్ పాఠశాలను తనిఖీ చేసి నిర్వహణ తీరును పరిశీలించారు. హాజరైన విద్యార్థులు, గైర్హాజరైన విద్యార్థుల వివరాలను అడిగి తెలుసకున్నారు.

'ఆదిత్య'లో సాంకేతిక ఉత్సవం

గండేపల్లి, మార్చి 19: సూరంపాలెంలో ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఈనలె 18,19న స్ట్రెంగ్త్ ఆఫ్ ఆన్ ఇంజనీర్ పేరిట సాంకేతిక ఉత్సవం నిర్వహించినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. అల్ట్రాటెక్ లిమిటెడ్ వారి సౌజన్యంతో విద్యార్థుల సృజనకు పోటీలు నిర్వహించారు. 370మందిపైగా విద్యార్థులు పాల్గొన్నట్టు కోఆర్డినేటర్ రాంసాగర్ తెలిపారు. విజయవంతంగా నిర్వహించిన సివిల్ విభాగాధిపతి డాక్టర్ రామ్మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులను ప్రిన్సిపాల్ అభినందించారు.

తిరుమలలో నెహ్రూ పూజలు

జగ్గంపేట, మార్చి 19: టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ ఇర్రిపాకలో 11 రోజులు పాటు నిర్వహించిన కోటి పార్థివ లింగ మహా రుద్రాభిషేకం విజయవంతంగా పూర్తి చేసుకోవడంతో తిరుమల వేంకటేశ్వరస్వామిని మంగళవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జగ్గంపేట ఎమ్మెల్యేగా గెలిపించాలని స్వామిని కోరుకున్నానని చెప్పారు.